రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## నల్లపోచమ్మ జాతరలో విక్రయాలకు బహిరంగ వేలం

**కౌడిపల్లి, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** మెదక్‌జిల్లాలోని ఏడుపాయల వనదుర్గాదేవి జాతర ఉత్సవాల తర్వాత రెండవజాతరగా పేరుగాంచిన తునికి శ్రీనల్లపోచమ్మ ఆలయం జాతర ఉత్సవాలు మొదలుకొని సంవత్సరంకాలం పాటు అనగా 2025 మార్చి 1వతేదీ నుండి మొదలుకొని 2026 ఫిబ్రవరి 28వ తేదీవరకు ఆలయంవద్ద కొబ్బరికాయల విక్రయాలు, షాపింగ్‌మాల్‌లో ఆటవస్తువులు, తినుబండారాలు, పార్కింగ్, టెంట్ సామాగ్రి అద్దెకు ఇచ్చే తదితరాల వాటికి సంబంధించి దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 17వతేదీ బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇంచార్జి ఈఓ వి. రంగారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆలయంవద్ద బహిరంగ వేలంపాటలో పాల్గొనేవారు కొబ్బరికాయల విక్రయంకుగాను రూ.5లక్షలు, ఆలయం ఆధ్వర్యంలో కొనసాగే మూడు షాపులకుగాను రూ.లక్షలు, టెంట్ హౌస్ వంటపాత్రలు అద్దెకు నడుపుటకుగాను రూ.లక్ష, కేవలం మార్చి 17 నుండి మార్చి 20వతేదీ వరకు జాతర ఉత్సవాల సమయంలోనే వాహనాల పార్కింగ్‌కుగాను రూ.25వేల రూపాయల ధరావత్ డిడిని ఆలయం పేరిట తీసుకొని వేలంప్రకటనకు గంట ముందుగా దరఖాస్తులు సమర్పించి, వేలంపాటలో పాల్గొనాలని ఈఓ తెలిపారు.

## కమనీయం....శివపార్వతుల కళ్యాణం

**ఆమనగల్లు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** ఆమనగల్లుపట్టణంలోని శ్రీభవానిరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శివపార్వతులకల్యాణం అంగరంగవైభవంగాసాగింది. వేదపండితులు మల్లిఖార్జున్, అక్షయ్, మహేశ్‌లబృందం శాస్త్రోక్తంగా మంత్రోచ్చారణలమధ్య భక్తులు కల్యాణఘట్టాన్ని నిర్వహించారు. శ్రీభవానిరామలింగేశ్వరస్వామి ఆలయ తృతీయవార్షికోత్సవం పురస్కరించుకుని మూడు రోజులపాటు వార్షిక ఉత్సవాలు ఘనంగాజరుగుతున్నాయి. ఉత్సవాలసందర్భంగా చివరిరోజు శివపార్వతులకల్యాణాన్ని ఏర్పాటుచేశారు. ఆలయనిర్మాణదాత, చైర్మన్ రేగట్టి శ్రీనివాస్‌దంపతులు పరమేశ్వరుడి కల్యాణాన్ని జరిపించారు. కల్యాణఘట్టాన్ని తిలకించడానికి శివభక్తులు, సాధారణభక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేశారు. భక్తులరాకను పురస్కరించుకుని ఉత్సవకమిటీ తగు ఏర్పాట్లుచేశారు. దీంతో ఆలయపరిసరాలు భక్తులతో రద్దీగా దర్శనమిచ్చాయి. దాదాపు గంటన్నరపాటు జరిగిన కల్యాణ వేడుకలను తిలకించిన భక్తులు పరమేశ్వరుడినామస్మరణతో పరవశించిపోయారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు భవానిరామలింగేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

# ముంచుకొస్తున్న గడువు..వసూలు కాని పన్నులు..

-వరుస సర్వేల కారణంగా పన్ను వసూళ్లలో జాప్యం
-మండలంలో 73 శాతం మాత్రమే పన్నుల వసూళ్లు



మండల ప్రజా పరిషత్ కార్యాలయం

**ధారూరు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
పంచాయతీలలో 2024-25 సంవత్సరం పన్ను వసూళ్లకు 43రోజులుమాత్రమే మిగిలాయి. కొత్త పంచాయతీరాజ్ చట్టంప్రకారం గ్రామ పంచాయతీలు ఇంటిపన్ను,(నాన్ టాక్స్)సంతలు, లైసెన్సులు, బంజరుదొడ్డి తదితరవాటిపై ఏటా ప్రణాళికప్రకారం వందశాతంపన్ను వసూలుచేయాలి. వచ్చిన నగదును కార్యాలయంలో జమచేసి గ్రామపంచాయతీ అవసరాలు, సిబ్బంది, పారిశుధ్య కార్మికుల వేతనాలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ, గ్రామసభల ఏర్పాటుకు ఖర్చు చేస్తారు. ప్రతి ఆర్థికసంవత్సరం(మార్చి 31) ముగిసేలోపు ఏడాదిలక్ష్యంమేరకు పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. పంచాయతీల్లో పన్నుల వసూళ్లు మందకొండిగా సాగుతున్నాయి. పంచాయతీ కార్యదర్శులు వరుసగా ప్రభుత్వ పథకాల అమలు, ప్రజాపాలన, సామాజిక సర్వే, ఇందిరమ్మఇళ్ల సర్వేలతో బిజీగా ఉండడంతో పన్ను వసూళ్లపై ప్రభావంపడింది. దాదాపు రెండునుంచి మూడునెలల పాటు పంచాయతీ కార్యదర్శులు ఈకార్యక్రమాలతోనే బిజీబిజీగాగడిపారు. ఇప్పుడు ఆర్థిక సంవత్సరం ముగింపునకు 43రోజులు గడువు ఉండటంతో పన్నువసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఏడాదిపాటు నిర్లక్ష్యం చేసిన అధికారులు ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి పన్ను వసూళ్లలో హడావిడి చేస్తుంటారని, ఈనిర్లక్ష్యం కారణంగా పన్నులు 100శాతం వసూలుకావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

**గ్రామపంచాయతీవారీగా పన్నువసూలు శాతం..**
మండలంలోని ధారూర్‌స్టేషన్ గ్రామపంచాయతీలు అతితక్కువ(9శాతం) పన్నువసూలయ్యింది. అయితే పన్నువసూళ్లలో ముందంజలో నర్సాపూర్(97శాతం), ఎబ్బనూర్(94శాతం),హరిదాసుపల్లి (91శాతం) గ్రామపంచాయతీలు ఉన్నాయి. అంతారం, గురుదొట్ల, నాగారం, ధారూర్, కుమ్మరిపల్లి, పిసిఎంతండా, కెరెల్లి, దోర్నాల్, తరిగోపుల, రుద్రారం, అల్లీపూర్, మైలారం, మోమిన్‌కలాన్, చింతకుంట, కొండాపూర్‌కాలనీ, కుక్కింద, మున్నూరుసోమరం, అల్లాపూర్, గడ్డమీదిగంగారం, మోమిన్ కుర్దు, రాంపూర్, అంపల్లి, గట్టేపల్లి, నాగసమందర్, నాగసాన్‌పల్లి, రాంపూర్‌తండా, హౌస్‌పల్లి, ధర్మాపూర్ గ్రామపంచాయతీలు 80శాతం లోపు వసూలుచేశాయి.

**మండలంలో 73శాతం పన్ను వసూలు..**
మండలంవ్యాప్తంగా 32గ్రామపంచాయతీలున్నాయి. ఇందుకుసంబంధించి రూ.37,86,667 లక్షలపన్నువసూలు లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు రూ.27,76,566లక్షలు వసూలయ్యాయి. ఇంకా రూ.10,13,956 వసూలు కావలసి ఉంది. పన్నువాసులపై గ్రామ ప్రత్యేకాధికారులు దృష్టిపెట్టితే బాగుంటుందని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి పెట్టి 100శాతం పన్ను వసూలయ్యేలా చర్యలు చేపట్టాలని పలువురు పేర్కొంటున్నారు.

**పన్నువసూళ్లు వేగవంతం చేస్తాం: ఎంపిఓ షఫీ ఉల్లాఖాన్..**
ఇంటిపన్నుల వసూళ్లప్రక్రియకొంత మందకొడిగానే సాగుతోంది. ప్రభుత్వం కేటాయించిన వివిధ రకాల పనుల్లో సిబ్బంది నిమగ్నం కావడం కూడా దీనికి ఒకకారణమే. గ్రామ కార్యదర్శులు దాదాపు రెండునెలలుగా వివిధ సర్వేపనులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 73శాతం మేరకు పన్నులు వసూలయ్యాయి. మిగతావసూళ్లు కూడా వేగవంతం చేసి వందశాతం లక్ష్యాన్ని సాధిస్తాం.

## స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

-మాజీ మంత్రి లక్ష్మారెడ్డి


ఆమనగల్లులో కెటిఆర్ సభాస్థలిని పరిశీలిస్తున్న మాజీమంత్రి లక్ష్మారెడ్డి

**ఆమనగల్లు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కాంగ్రెస్‌ప్రభుత్వానికి తగినబుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, స్థానికసంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి గుణపాఠం తప్పదని బారాస మాజీమంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఇచ్చినహామీలు అమలుచేయకుండా రాష్ట్రంలో రేవంత్‌సర్కారు ప్రజలను మోసంచేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వతీరును ఎండగట్టి రైతుల పక్షాన పోరాడుతున్న బారాసకు ప్రజలు బాసటగా నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 18న కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆమనగల్లుపట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న రైతు నిరసనదీక్షకు బిఆర్‌ఎస్‌పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కెటిఆర్ రానున్నారని మాజీమంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం తెలంగాణరాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్, తలకొండపల్లి మాజీజడ్పిటిసి ఉప్పల వెంకటేష్‌గుప్తా, డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్ సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేష్‌గుప్తా, మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్‌నాయక్ స్థానిక బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి రైతుదీక్షా సభాస్థలి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలకుముందు ఇచ్చినహామీలు ఒక్కటీ సక్రమంగా అమలుకు నోచుకోవడంలేదని విమర్శించారు. రైతురుణమాఫీ, రైతుభరోసా, విద్యుత్ సరఫరాలో ప్రభుత్వం రైతులను మోసంచేస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బారాస ముఖ్యమంత్రి కెసిఆర్ పదేళ్ళు స్వర్ణయుగంగా పాలించాడని లక్ష్మారెడ్డి అన్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టేందుకు నిర్వహిస్తున్న రైతునిరసన దీక్షకు రైతులు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని, ఆమనగల్లులో జరిగే రైతునిరసన దీక్షకు కూడా భారీ ఎత్తున ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని బిఆర్‌ఎస్ శ్రేణులు అభిమానులు కార్యకర్తలు హాజరై విజయవంతంచేయాలని ఆయనకోరారు. ఆయనవెంట ఆమనగల్‌మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ జెడ్పిటిసి నరసింహ, తలకొండపల్లి మాజీ ఎంపిపి నిర్మల శ్రీశైలంగౌడ్, రామ్ నుంతల, తలకొండపల్లి మాజీసర్పంచ్‌లు శ్రీనునాయక్, జోతయ్య, బిఆర్‌ఎస్ నాయకులు గంప శ్రీను, శేఖర్, సంతోష్, బాలస్వామి, దినేష్, వెంకటేష్, సైదులు, జగన్, యాదయ్య, బిఆర్‌ఎస్‌పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో టిఎల్‌ఎఫ్‌నేతల సమావేశం


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో సమావేశమైన టిఎల్‌ఎఫ్ నాయకులు

**షాద్‌నగర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం, ఉమ్మడి నల్గొండ, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ ఉమ్మడిజిల్లాల టీచర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలసందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి గంగాపురం కిషన్‌రెడ్డితో తెలంగాణ లెక్చరర్స్‌ఫోరం (టిఎల్‌ఎఫ్) షాద్‌నగర్ నాయకులు ఆదివారం కలుసుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్రంలోని కళాశాలలు, పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయంపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందిస్తూ ఉపాధ్యాయులకు బిజెపి ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. అదేవిధంగా ఈ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మద్దతునివ్వాలని ఆయన కోరినట్లు పేర్కొన్నారు. ఆయనను కలిసిన వారిలో టిఎల్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సిద్ధేశ్వర్, డాక్టర్ యాదయ్య, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## 'రామరాజ్యంఆర్మీ' హింసపై చర్యలు తీసుకోవాలి



రాజ్యాంగపీఠికపై ప్రమాణం చేస్తున్న బాల్‌రాజ్, అరుణ్‌కుమార్ తదితరులు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని అనుసరించాలని బిజెపి సీనియర్ నాయకులు గుండ్ల బాల్‌రాజ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం ప్రబుద్ధభారత్ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో 201వ వారం నిత్యపూలమాల కార్యక్రమం నిర్వహించారు. పిబిఐ మేడ్చల్‌జిల్లా సమన్వయకర్త ఎం. అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బిజెపినేత బాల్‌రాజ్‌ముదిరాజ్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. దేశంలో బడుగు, బలహీనవర్గాలకు అంబేద్కర్ రచించిన రాజ్యాంగతో రాజకీయంగా, ఉద్యోగపరంగా అవకాశాలు వచ్చాయని బాల్‌రాజ్ అన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో యువత విద్య, సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం అందరూ భారత రాజ్యాంగపీఠికపై ప్రమాణం చేశారు. సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా ఆయన ప్లెక్సీకి పూలమాలవేసి నివాళులు అర్పించి అరుణ్‌కుమార్ సేవాలాల్ జీవిత చరిత్రను తెలియజేశారు. రామరాజ్యం ఆర్మీ పేరుతో హింసకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అర్చకులు రంజరాజన్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఆయనకు పూర్తిమద్దతు తెలియజేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షులు మేకల దాసు, కడుపొల్ల ఈశ్వర్, నర్సింగ్‌రావు, బండారు రాందాస్, సత్యం, వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్, జగదీష్, అంజనేయులు, ఆనంద్, సచిన్, ప్రవీణ్, విష్ణు, సాయిప్రకాష్, అఖిల్, యాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## బర్డ్‌ఫ్లూ ప్రభావంతో పెరిగిన మటన్, చేపల అమ్మకాలు

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
బర్డ్‌ఫ్లూ వ్యాధిప్రభావం చికెన్‌మార్కెట్‌పై పడింది. బర్డ్‌ఫ్లూభయంతో జనం చికెన్, గుడ్లకు దూరంగా ఉంటున్నారు. ఘట్‌కేసర్‌పట్టణంలో చికెన్‌దుకాణాలు వినియోగదారులులేక వెలవెలబోతున్నాయి. బర్డ్‌ఫ్లూకారణంగా మార్కెట్‌కు వచ్చే కోళ్లసంఖ్య భారీగాతగ్గిపోయి అమ్మకాలు పడిపోయాయి. 15రోజుల క్రితం కిలోచికెన్ రూ.220 ఉండగా ప్రస్తుతం రూ.160 నుంచి 180కు పడిపోయింది. తెలుగురాష్ట్రాలలో బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో చికెన్ అమ్మకాలు తగ్గిపోగా మరోవైపు మటన్, చేపల విక్రయాలు పెరిగాయి. ఘట్‌కేసర్‌పట్టణంలో మటన్, చేపల దుకాణాలముందు ఆదివారం వినియోగదారులు బారులు తీరారు. చికెన్ తినవచ్చని ప్రభుత్వం చెబుతున్నా ప్రజల్లో మాత్రం భయం వీడటంలేదు. మాంసం ప్రియులు చేపలు, రొయ్యలు, మేక, గొర్రెల మాసం వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో మటన్, చేపల మార్కెట్ రద్దీగా మారుతోంది.

## గురుకుల్‌కు పూర్వవైభవం తేవాలని వినతులు


ఎమ్మెల్సీ తీన్మార్‌మల్లన్నకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ యాదగిరి

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ పట్టణంలోని గురుకుల్ విద్యాసంస్థను అభివృద్ధి పరిచి పూర్వవైభవం తీసుకురావడానికి చేపట్టిన ఉత్తరాల ఉద్యమం గత 18 రోజులుగా కొనసాగుతున్నది. ఘట్‌కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరియాదవ్ ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థులు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి వినతిపత్రాలను అందించారు. ఈమేరకు ఆదివారం శాసనమండలి సభ్యులు తీన్మార్‌మల్లన్న (చింతపండు నవీన్)ను ఆయన కార్యాలయంలో కలిసి మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ వినతిపత్రం అందజేశారు. ఎంతో ఘన చరిత్ర కల్గిన గురుకుల్‌ను అభివృద్ధి పరిచేందుకు నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌ఎఫ్‌సీనగర్ మాజీ ఎంపిటిసి జంపాల రమేశ్, నాయకులు గాజుల వీరేందర్ యాదవ్‌లు ఉన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన నల్లపోచమ్మ ఆలయం

**కౌడిపల్లి, ఫిబ్రవరి16, ప్రభాతవార్త:**
తెలంగాణరాష్ట్రంలోని మెదక్‌జిల్లాలో రెండవ అతిపెద్ద జాతరగా పేరుగాంచిన తునికి శ్రీనల్లపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయంనుండి ఆలయంవద్ద భక్తులతో సందడిగామారింది. ఆదివారం సెలవుదినంకావడంతో ఉదయంనుండి భక్తులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగస్థులు సైతం తమ కుటుంబసమేతం శ్రీనల్లపోచమ్మ ఆలయానికి పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఆలయఇంచార్జి ఈఓ వి.రంగారావు, ప్రధాన అర్చకులు శివప్పలు శ్రీనల్లపోచమ్మకి పంచామృత అభిషేకంచేసి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, కుంకుమార్చనచేసిన తర్వాత భక్తులకు అమ్మవారిదర్శనం కల్పించగా భక్తులు ఒడి బియ్యంపోసి, ప్రత్యేక పూజలు నిరవ్వహించి, తమ మొక్కులనుతీర్చుకొవడానికి పెద్దసంఖ్యలో హాజరైనారు. భక్తులు శివశక్తుల విన్యాసాలనడుమ భక్తులు బోనాలను డప్పుచప్పుళ్ళతో ఆలయంచుట్టు ఊరేగించి, భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారికి బోనంనైవేద్యంసమర్పించి, జంతుబలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ వి.రంగారావు తనసిబ్బంది సహకారంతో గర్భగుడిలోకి భక్తులకు దర్శనంకల్పించారు. అటవీప్రాంతంలో ఆలహాదకరమైన వాతావరణంలో వెలసిన శ్రీనల్లపోచమ్మ ఆలయంవద్ద ప్రతి ఆదివారం చిన్నచిన్న శుభకారాయ్యలను చేస్తుండటంతో భక్తులరద్దీ మరింత పెరిగిపోతుంది. ఆసలే వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉండటం కారణంగా త్రాగునీటికి ఎలాంటి అసౌర్యాలు కల్గకుండా భక్తులకు ఈఓ తనసిబ్బందితో నీటిసౌలభ్యతతోపాటు మౌలిక వసతులు కల్పించారు. ఈకారయ్క్రమంలో ఆలయం జూనియర్ అసిస్టెంట్ వేంకట్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శివప్ప, గ్రామపెద్దలు, భక్తులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపి

**దౌల్తాబాద్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
దౌల్తాబాద్‌మండలంలోని గోకఫస్లావాద్ గ్రామంలో ఆదివారం శివాలయ ప్రాణప్రతిష్ఠాపన కార్యక్రమంలో మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ పాల్గొన్నారు. శివాలయ ప్రాణప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఎంపి డికె అరుణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నారాయణపేట జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ప్రతాపరెడ్డి, నరసింహులు, సతీష్ ముదిరాజ్, చరణ్, సిద్దేశ్వర్, మాజీ ఎంపిటిసిసి కేశవరెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## అత్వెల్లిలో ఘనంగా మల్లన్న జాతర

**మేడ్చల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
మేడ్చల్ మున్సిపల్‌పరిధిలోని అత్వెల్లిగ్రామంలోగల మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈజాతరకు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఊరేగింపు నిర్వహించి నైవేద్యం సమర్పించారు.

## మదర్సా వార్షికోత్సవ వేడుకలు


విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేసిన మతపెద్దలు

**ఆమనగల్లు, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
ఆమనగల్లు పట్టణంలోని మదర్సా దారుల్ ఉలుం అన్వరే ముస్తఫా ఆధ్వర్యంలో విఠాయిపల్లి బిఎన్‌ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జష్ నే దస్తార్ బంది వ తక్మీమే సనద్ అజీమ్ వ షాన్ జల్సా, పదకొండువ వార్షికోత్సవ వేడుకలు మదర్సా ప్రిన్సిపల్ మౌలానా అబ్దుల్ కరీం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని దారుల్ ఉలుం అన్వరే ముస్తఫా మదర్సా విద్యార్థులు ఖురాన్‌పఠనం పూర్తిచేసి హాఫిజ్ ఖురాన్ అయ్యారు. అందులోభాగంగా ఏర్పాటు చేసిన జల్సా కార్యక్రమంలో ముఖ్యఅతిథులు తయ్యాబ్ షా కలిముల్లా హుసేని, బంధనవాజి ఆల్ మారుఫ్‌ఖాసిక్ పాషా, సహాబ్,హజ్రత్ అల్లామా, మౌలానా సయ్యద్ రవూఫ్, అలీ ఖాద్రి ముల్తాని సాహెబ్ కిబల సదర్ ముదరిస్ దారులుమ్ అరేబియా కౌరంపేట్ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్ పంపిణీచేశారు. మదర్సా ప్రిన్సిపల్ హజ్రత్ మౌలానా అబ్దుల్ కరీంషా ఖాద్రి సాహెబ్, మదర్సా విద్యార్థులు మీర్జా సోహెల్ బేగ్, మీర్జా సానియా బేగం, సబా బేగం, అలియా ఫాతిమా, మహ్మద్ చాంద్‌రజా, మహ్మద్ గరీబ్ నవాజ్, మహ్మద్ తౌకిర్ రజా, మహ్మద్ మేరాజ్ ఆలం, మహ్మద్ సైఫాన్‌ఖాన్, విద్యార్థుల తల్లిదండ్రులను పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో మదర్సాఅధ్యక్షులు సయ్యద్ ఖలీల్, నాయబ్‌సదర్ మహబూబ్, మదర్సా కమిటీసభ్యులు ఆయామండలాల మైనార్టీసోదరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ ప్రభుత్వోద్యోగులసంఘం క్యాలెండర్ అవిష్కరణ

**కొడంగల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్ర ముదిరాజ్ ప్రభుత్వ ఉదోయ్గులసంఘం 2025 సంవత్సరం క్యాలెండర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అవిష్కరిం చినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.వెంకటేష్(కొడంగల్ ఎక్సైజ్ సిఐ) తెలిపారు. ఆదివారం హైద్రాబాద్‌లో జూబ్లీ హిల్స్‌లో సిఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవిష్కరించినట్లు తెలిపారు. సిఎం మాట్లాడుతూ ముదిరాజ్ ఉద్యోగులకు తగిన ప్రాధాన్యత ఇచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో అత్యధికంగా నిరుద్యోగులుగా ఉన్న ఏకైకజాతి అని ఇందుకోసం యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోసం స్కిల్ యూనివర్శిటీని ఏర్పాటు చేశామన్నారు. అత్యధికంగాచేరి లబ్ధిపొందాలన్నారు. ముదిరాజ్‌లకు తగినగుర్తింపు ఇస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగులసంఘం అధ్యక్షులు వెంకటేష్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బట్టు విఠల్‌ముదిరాజ్, ధనరాజ్‌ముదిరాజ్, ప్రధానకార్యదర్శి జంగయ్యముదిరాజ్, సిఐలు నర్సింగ్‌ముదిరాజ్, భాస్కర్ ముదిరాజ్,ఎస్సైలు కృష్ణమూర్తిముదిరాజ్,కోశాధికారి మహేష్ ముదిరాజ్, కార్యవర్గ సభ్యులు,జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

**ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా జి.వెంకటేష్...**
ముదిరాజ్ ప్రభుత్వ ఉద్యోగులసంఘం రాష్ట్ర అధ్యక్షులుగా జి.వెంకటేష్‌ముదిరాజ్ ఎన్నికైయ్యారు. అలాగే రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి.జంగయ్య(సిఐ పోలీస్), ఉపాధ్యక్షులుగా సి.వెంకటయ్య (వాణిజ్య పన్నులు జిఎస్‌టీ), ఎం.సురేందర్ (ఏఈవిద్యుత్),వి.ధనరాజ్(జెఎపోలీస్ సిఐడి) బి.విఠల్,రాష్ట్ర కోషాధికారిగా రాజమౌళి మహేశ్వర్(ఎస్‌టీఓ),రాష్ట్ర సంయుక్త కార్యదర్శులుగా సురేష్‌బాబు (సీఐపోలీస్), కె.విష్ణువర్ధన్,రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులుగా పి.శ్రీనివాస్, కె. రామకృష్ణ,కొండల్‌రావు,ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా బోయిన వెంకటేశ్వర్లు,ఎస్,అశ్విన్‌కుమార్,శివ,బి.ప్రసాద్,రాము(సీఐ కోదాడ)రాష్ట్ర కోఆర్డీనేటర్ తురక మహేష్‌రాజ్‌లు ఎన్నికైనట్లు తెలిపారు.

## ఐఎన్‌టీయూసి జాతీయ అధ్యక్షుడిని కలిసిన జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్

**ఆమనగల్లు, ఫిబ్రవరి16, ప్రభాతవార్త:** ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డిని ఆదివారం ఐఎన్‌టియుసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, ఆమనగల్లు వాసి ఎంగలి ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సంజీవరెడ్డికి పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేకకార్యక్రమంలో సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు

-ఎ ంపిఎల్ సీజన్6 ప్రారంభం


ఎంపిఎల్ పోటీలను ప్రారంభిస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని

**ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
యువత సమయం వృధా చేసుకోకుండా క్రీడలలో రాణించడం ద్వారా గుర్తింపు లభిస్తుందని సిఎంఆర్ హెల్త్‌సిటి చైర్మన్ డాక్టర్ చామకూర భద్రారెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్‌లు పేర్కొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మాదారంలో ఆదివారం ఎంపిఎల్ సీజన్ 6 క్రికెట్‌పోటీలకు వారు విచ్చేసి ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మైదానంలో టాస్‌వేసి టోర్నమెంట్‌ను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు శాలువాలు కప్పి సన్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో గెలుపు,ఓటములు సమానమేనని క్రీడాకారులు అత్యున్నత ప్రదర్శన, వ్యక్తిత్వంద్వారా మైదానంలో అభిమానులు ఆధారాభిమానాలు చూరగొనాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు మామిండ్ల ముత్యాలుయాదవ్, మాజీ సర్పంచ్ నల్లోళ్ల యాదగిరి, మాజీ కౌన్సిలర్లు బండారి అంజనేయులు, కడుపొల్ల మల్లేశ, మండల బిఆర్‌ఎస్ ప్రధానకార్యదర్శి పన్నాల కొండల్‌రెడ్డి, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, నాయకులు జిల్లాల రాజశేఖర్‌రెడ్డి, చింతకింది వేణుగోపాల్, శివాజీయాదవ్, లాలయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ ప్రభుత్వోద్యోగులసంఘం క్యాలెండర్ అవిష్కరణ

**కొడంగల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్ర ముదిరాజ్ ప్రభుత్వ ఉదోయ్గుల సంఘం 2025 సంవత్సరం క్యాలెండర్‌ను సిఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా అవిష్కరించినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.వెంకటేష్ (కొడంగల్ ఎక్సైజ్ సిఐ) తెలిపారు. ఆదివారం హైద్రాబాద్‌లో జూబ్లీహిల్స్‌లో సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవిష్కరించినట్లు తెలిపారు.

## మేడ్చల్‌లో పట్టపగలే దారుణహత్య

-సోదరుడే హత్యగావించాడనే అనుమానాలు

**మేడ్చల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
మేడ్చల్‌పట్టణంలో నడిరోడ్డుపై పట్టపగలే ఓవ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. తీవ్ర సంచలనంరేపిన ఈఘటన వివరాల ప్రకారం కామారెడ్డి జిల్లా మాచారెడ్డికిచెందిన గన్యా మేడ్చల్ బస్‌డిపోలో ఆర్టీసీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఉద్యోగరీత్యా మేడ్చల్‌లో పనిచేస్తున్న అతను కుటుంబ సభ్యులతో కలిసి మేడ్చల్‌పట్టణంలో నివాసముంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం మేడ్చల్ డిపోముందు నుండి గన్యా రెండోకుమారుడు ఉమేష్(30) 44వ జాతీయరహదారిపై వెళుతుండగా ఇద్దరువ్యక్తులు అకస్మాత్తుగావచ్చి రోడ్డుపైనే కత్తితో కడుపులోపొడిచారు. అతను అక్కడికక్కడే కుప్పకూలిపోయినప్పటికినీ వెనువెంటనే ఇరవై,ముప్పై పోట్లుపొడిచి అక్కడినుంచి తాపీగా వెళ్లిపోయారు. జరుగుతున్న హత్యను స్థానికులు విడియోలు తీసి సోషల్‌మీడియాలో పెట్టడంతో ఈసంఘటన పట్టణంలో దావానలంలా వ్యాపించడంతో ప్రజలు బస్‌డిపో వద్దకు చేరుకుని గుమ్మిగూడారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అప్పటికే అతను ప్రాణాలు వదిలాడు. కాగా కుటుంబకలహాల కారణంగా మృతుడి తమ్ముడే మరోవ్యక్తితోకలిసి కత్తితోపొడిచి ఈదారుణానికి ఒడిగట్టినట్లు సమాచారం. మద్యానికి బానిసై కుటుంబసభ్యులను వేధింపులకు గురిచేస్తున్న కారణంగా విసిగిపోయి గన్యా చిన్నకుమారుడే హత్యకు పూనుకున్నట్టు తెలవడంతో ప్రజలు ఆశ్చర్యానికి గురైయ్యారు. గన్యాకు ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉండగా హత్యకు గురైనవ్యక్తి సంతానంలో రెండోవాడు కాగా, హత్యచేసింది చిన్నకుమారుడిగా భావిస్తున్నారు. కాగా పూర్తివివరాల కోసం సిఐ సత్యనారాయణ, సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి విచారణ చేపట్టారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

**పెద్దేముల్, ఫిబ్రవరి 16, ప్రభాతవార్త:**
బైక్ అదుపుతప్పి ఓవ్యక్తి మృతిచెందిన సంఘటన పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, తాండూరుమండలం కోటబాసుపల్లిగ్రామానికి చెందిన ముద్దంగుల బాలక్రిష్ణ (28) హైద్రాబాద్ దూలపల్లిలో ఉంటూ, కారుడ్రైవరుగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం హైద్రాబాద్ నుంచి కోటబాసుపల్లికి కోటపల్లి మీదుగా వస్తుండగా పెద్దేముల్ శివారులో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన గల ముళ్ళపొదలో పడిపోయాడు. ముఖంపై, ఇతర శరీర భాగాలకు తీవ్రగాయాలై మృతిచెందాడు. అటుగా వెళుతున్న గ్రామస్థులు బాలక్రిష్ణ ఫోన్ తీసుకొని వారితండ్రికి ఫోన్‌చేసి విషయం చెప్పారు. మృతుడితండ్రి ముద్దంగుల బాలయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.



ఎఇ కార్యాలయంలో కూత వేటు దూరంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

## కంచెలేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

**బేగంబజార్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** బేగంబజార్ డివిజన్ పరిధిలోని ఫీల్‌ఖానా, డిఇ కార్యాలయం ఎదురుగా ఉన్న తోఫ్‌ఖానా, చేపల మార్కెట్ వెళ్లే రహదారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్లు చుట్టు కంచెలు లేకపోవడం తో ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. మరికొన్ని చోట్ల ఏకంగా ట్రాన్స్‌ఫార్మార్లు అనుకుని వ్యాపారం చేస్తున్నారు. ఫీల్‌ఖానా ఎఇ సెక్షన్ పరిధిలోని అనేక చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్ల వైర్లు ప్రమాదకరంగా మారాయి. అసలే ఎండకాలం రాబోతుంది. అధికారులు కేవలం కరెంట్ బిల్లు లపై దృష్టి సారించడం తప్ప విద్యుత్ ట్రాన్స్‌పార్మార్లకు చుట్టు కంచెలు ఏర్పాటు చేయించాలన్న ఆలోచన ఏమాత్రం కనిపించడంలేదు. పైన పేర్కొనబడిన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఫీల్‌ఖానా, తోఫ్‌ఖానా, సంతోష్‌దాబా, పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫా ర్మార్లకు కంచలు లేకపోవడంతో ప్రజలు భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫీల్‌ఖానా ప్రాంతంలో ఉన్నవిద్యుత్ ట్రాన్స్‌ఫార్మార్ల వద్ద వ్యాపా రులు ప్లాస్టిక్ కాగితాలు, చెత్తాచెదారాన్ని అక్కడ వేయడం మూలంగా గతం లో విద్యుత్ ప్రమాదం చోటు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటారు. అటు అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా బేగంబజార్ డివిజన్ ఇంజనీర్ స్పందించి విద్యుత్ చుట్టు కంచెలు ఏర్పాటు చేసే విధంగా ఎఇకి ఆదేశాలు జారీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పోలీస్ స్టేడియంలో ఆసుపత్రి నిర్మించొద్దు

**అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** గోషామహల్ పోలీస్‌స్టేడియంలో నిర్మించవద్దని పొలిటికల్ జెఎసి ఆద్వర్యంలో ఆందోళన చేస్తామని ప్రజా ఏక్తాపార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్‌గుప్త అన్నారు. ఆదివారం గౌలిగూడలోని పార్టీ కార్యాలయంలో టిడిపి తెలంగాణ వాణిజ్యసెల్ జాయింట్ సెక్రటరీ కెడి.దినేష్ ఆద్వర్యంలో ప్రజా ఏక్తాపార్టీ జాతీయ అద్యక్షులు శ్రీనివాస్‌గుప్తను కలిసి మద్దతు కోరారు. అందుకు తన పార్టీ తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో మూసినదికి అనుకుని నిజాం కాలంలో నిర్మించిన ఉస్మానియా ఆసుత్రిలోని ఖాళీ స్థలంలోనే ఉస్మానియా ఆసుపత్రి భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోషామహల్ పోలీస్ స్టేడియాన్ని అనుకుని ఉన్న నాళా భారీ వర్షాలు వస్తే ప్రవహించి వర్షం నీరు పోలీస్‌గ్రౌండ్‌లో వస్తాయన్నారు. ప్రభుత్వం మొండి పట్టుగా ఏకంగా శంఖుస్థాపన చేసిందన్నారు. స్థానిక ప్రజల మనోభావాలను తెలుసుకోకుండా ఇక్కడ కొత్త ఆసుపత్రిన్ని నిర్మిస్తామనడం పట్ల సమంజసమని వారు ప్రశ్నించారు. ఉస్మానియా ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న స్థలంలో నూతన ఆసుపత్రిని నిర్మించాల్సిన అవసరం ప్రభుత్వం ఎంతైనా ఉందన్నారు. లేనిపక్షంలో పొలిటికల్ జెఎసి ఆద్వర్యంలో ఆందోళన, నిరసనలు కొనసాగిస్తామన్నారు.

## క్రీడలతో వ్యక్తిత్వం వికసిస్తుంది : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** కార్ఖానా మహంకాళి టెంపుల్ దగ్గర సుశీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటోన్మెంట్ క్యారం టోర్న మెంట్‌ను ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించి క్రీడాకారులతో పాటు కాసేపు క్యారం ఆడారు. ప్రతి ఒక్కరు ఆటలు ఆడాలని, ఆటలు మనిషి యొక్క వ్యక్తిత్వాన్ని తీర్చుదిద్దుతాయని, గెలుపు స్ఫూర్తిని నింపేతే ఓటమిని తట్టుకునే ముందుకు వెళ్లే మనో ధైర్యాన్ని కూడా క్రీడలు నేర్పుతాయని అన్నారు. ముఖ్యంగా విద్యార్ధులు చదువులతో పాటు క్రీడలు, ఆట పాటలలో కూడా పాల్గొంటే వారి వ్యక్తిత్వం మరింత వికసిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ క్యారం టోర్నమెంట్ లో పాల్గొన్న క్రీడాకారులను, నిర్వాహకులను అభినందించారు.

## నిస్వార్థంతో పరిశుద్ధంగా జీవించాలి



పెంతెకోస్టల్ బ్రదర్ శరవణన్ కుమార్‌కు వీడ్కోలు పలుకుతున్న దృశ్యం

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** సికింద్రాబాద్ మారేడు మారేడుపల్లి పెంతుకోస్తు మిషన్ చర్చిలో బ్రదర్ గా సేవలు అందిస్తున్న శరవణన్‌కు దేశ రాజధాని ఢిల్లీలో విధంగా సేవలు చేసేందుకు టిపియం చర్చి తరపున బదిలీ అయ్యారు ఈ సందర్భంగా పలు ప్రాంతాల నుండి వచ్చిన క్రైస్తవ విశ్వాసులు నాయకులు ఆదివారం ప్రార్ధనల అనంతరం వారిని అభినందించి వారికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా బ్రదర్ శరవణన్ మాట్లాడుతూ, ప్రతి క్రైస్తవ విశ్వాసి యేసు క్రీస్తు లాగా నిస్వార్థంతో పరిశుద్ధంగా జీవించాలని అందుకు తన జీవితం ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వాస సహోదరులు పి. జాన్, ప్రభుదాస్ ఆనంద్, జెరుషలేం మత్తయ్య, జోస్పిన్, ఏనోషు హెప్సిభ, ఎబ్బేజ్, అరుణ్ నిరీక్షణ్ తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు అందజేత




వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన సందర్భంగా బోయిన్‌పల్లి వ్యవసారి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం 2వ వార్డు రసూల్ పుర గన్ బజార్ గ్రౌండ్‌లో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు టిఆర్ఎస్ అధ్యక్షులు కుమార్ ముదిరాజ్ నాయకులు వహబ్, అమీంగ్, సమీంగ్, ఆసిఫ్, ముజీద్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## చిక్‌చావనీలో 'ప్రకాష్ పురబ్'

**మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** పాతబస్తీ కిషన్‌బాగ్ చిక్‌చావనీ సాహెబ్ బరంబాలాలో ప్రకాష్ పురబ్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సిక్ కమిటి అధ్యక్షులు చేతన్ సింగ్, ఉపాధ్యక్షులు సర్దార్ నానక్ సింగ్, చైర్మన్ హర్బాన్ సింగ్, కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న సిక్ కమిటి ప్రతినిధులు

# కుల గణన సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

### రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్




కుల గణనపై అవగాహన కల్పిస్తున్న రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**చార్మినార్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** గతంలో నిర్వహించిన కుల గణన సర్వేలో పాల్గొనని వారికి ఫిబ్రవరి 16 నుంచి 28వ తేదీ వరకు మరోసారి ప్రభుత్వం నిర్వహిస్తుందని బిసిలు తమ వివరాలను నమోదు చేసుకోవాలని రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. హైదరాబాద్ పాతబస్తీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం పరిధి లోని కుమ్మరివాడిలో ఆదివారం ఆయన కుల గణన పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు బస్తీలో పర్యటించారు. కులగణన జరిగిందా అన్న విషయాన్ని బిసి కమిషన్ చైర్మన్ స్వయంగా ప్రజలను అడిగారు సమాచారాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో కులగణన సర్వేను యాభై రోజుల పాటు నిర్వహించటం జరిగిందని, 1,15,71,457 కుటుంబాలు ఉండగా అందులో 1.12,15,134 కుటుంబాలకు సంబం ధించిన కులగణన సర్వే చేయటం జరిగిందని తెలి పారు. ఇంకా 3,52,323 కుటుంబాలు కుల గణన సర్వే చేయవలసి ఉందని, ఈ నెల 28వ తేదీ వరకు కులగణన సర్వే జరుగుతున్నదని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. గ్రామీణ ప్రాంతాలలోని ఎంపిడిఓ కార్యా లయాలలో, జిహెచ్ఎంసి పట్టణ ప్రాంతాలలోని వార్డు కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సేవా కేంద్రాలలో ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. 040 21111111 టోల్ ఫ్రీ నెంబర్‌రుకు రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఫోన్ చేస్తే గణకులే ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేస్తారని ఆయన తెలిపారు. పాతబస్తీ కుమ్మరివాడి బస్తీలో 200 ఇండ్లు ఉండగా దాదాపుగా 71 ఇండ్లలో కుల గణన సర్వే కాలేదని, స్టిక్కర్లు అంటించి వెళ్లి పోయారని, వారి ఇంటి నెంబర్లు వివరాలను బిసి వెల్ఫేర్, మున్సిపల్ వార్డుఅధికారులు నోట్ చేసుకున్నారని, నమోదుకు చర్యలు తీసుకోనున్నారని స్థానికులు ఆయన వెల్లడించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జిహెచ్ఎంసిలో 19 లక్షల మంది సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకోగా, ప్రస్తుతం నిర్వహించిన కుల గణన సర్వేలో ఇరవై లక్షల మంది నమోదు చేసుకున్న విషయాన్ని జిహెచ్ఎంసి కమిషనర్ తెలిపారని ఆయన తెలియ జేశారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆశన్న, స్థానికులు వెంకటేష్ ముదిరాజ్, నరేష్, శ్యాంరావు ముదిరాజ్‌లు పాల్గొన్నారు.



దర్గాపైకి చద్దర్, పూలను తీసుకువెళ్తున్న దేప భాస్కర్‌రెడ్డి

## మత సామరస్యానికి ప్రతీకగా ఉర్సు ఉత్సవాలు

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** హైదరాబాద్ శివార్లలోని శ్రీశైలం రహదారిలోనున్న పహాడీషరీఫ్ గ్రామంలో వందల సంవత్సరాల చరిత్ర గల హజ్రత్ బాబా షర్ఫుద్దీన్ దర్గాలో 759వ ఉర్సు ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆదివారం దర్గాను సందర్శించిన టిపిసిసి సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి హజ్రత్ బాబాకు పూలు, చద్దర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలు మత సామ రస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు యూసుఫ్ ఖాద్రి, పున్న గణేష్ నేత, బండి మధుసూదన్‌రావులతో పాటు శివ, రవికుమార్, పుట్టగళ్ల జగన్, శ్రీధర్, సామ వరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి కృషి : బన్నాల గీత



కార్పొరేటర్ బన్నాల గీతను సత్కరిస్తున్న కాలనీ సంఘం నేతలు

**ఉప్పల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం చిలుకానగర్ శ్రీనగర్ కాలనీ సంఘం ఆధ్వర్యంలో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నేతలు ఎదుల కొండల్‌రెడ్డి, కె.జగన్, మహుమూద్, షనాజ్, శ్యామ్ కాలనీ నేతలు కొండయ్య, మనోహర్‌రావు, అంజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**ఉప్పల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లో ఎండు గంజాయి విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సిఐ బి.ఓంకార్ కథనం ప్రకారం.. ఉప్పల్ భగాయత్‌లో ఆదివారం మధ్యాహ్నం అల్వాల్ వెంకటాపురంకు చెందిన అభిషేక్‌కుమార్ సింగ్ అనే వ్యక్తి ఎండు గంజాయి తెచ్చి విక్రయాలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే అక్కడికి చేరుకుని నిందితుడిని పట్టుకుని అతని వద్ద నుంచి 5147 కిలో ఎండు గంజాయి, ఒక మెబైల్ ఫోన్, బజారు పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆంధ్ర, ఒరిస్సా నుంచి గంజాయి తెచ్చి అధిక ధరలకు నగరంలో విక్రయిస్తున్నాడని తెలిపారు. దీని విలువ రూ.ఒక లక్ష వరకు ఉంటుందని సిఐ ఓంకార్ తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఉప్పల్‌లో ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ సిఐ బి.ఓంకార్ తదితరులు




కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

**ఉప్పల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రమణిసిద్ధి ఆధ్వర్యంలో నెల నెల కళారాధన కార్యక్రమంలో భాగంగా త్యాగరాజ పంచరత్న కీర్తనలు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు నూతి ప్రసూన, రమణి సిద్ధి, బాలాజీకుమార్, రాజేశ్వరి, విశాఖ ప్రకాష్, మాధవిశర్మ శిష్య బృందంచే త్యాగరాజ కృతులు అలపించారు. ఎందరో మహానుబావులు, గణేశా పంచరత్న, జగదానందకారక తదితర అంశాలను కళాకారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. నాట్యగురువు పి.బి.కృష్ణభారతి ముఖ్యఅతిధిగావిచ్చేసి కళాకారులను సత్కరించారు.

## భరత్‌గౌడ్ పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి తరలి వెళ్లిన బిజెపి శ్రేణులు



మెట్టుగూడ నుంచి ర్యాలీగా వెళ్లుతున్న బిజేపీ శ్రేణులు

**మెట్టుగూడ, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా నూతన అధ్యక్షులుగా నియమితులైన గుండగోని భరత్‌గౌడ్ బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా మెట్టు గూడ డివిజన్ నుండిపెద్ద ఎత్తున బైక్ ర్యాలీతో బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గం నుంచి పెద్దుత్తున బీజేపీ, మహిళ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల మోర్చల నాయకులు, కార్యకర్తలు అభిమానులు, ప్రజలు ప్రతి పోలింగ్ బూతు నుండి పాల్గొన్న వారికి మహంకాళి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి దిశా కమిటీ సభ్యురాలు శారదామల్లేష్ అభినందలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజులలో పాల్గొం టారని ఆశిస్తూ మహంకాళి జిల్లా బీజేపీ నీ బలిష్టంగా తాయారు చేస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గంలోని, మెట్టు గూడ డివిజన్, తార్నాక డివిజన్, అడ్డగుట్ట, డివిజన్ సీతఫల్‌మండి డివిజన్, బౌద్ధ నగర్ డివిజన్‌లలో బీజేపీ ప్రథమ స్థానంలో ఉంచుతారని ఆశిస్తున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ మహేష్, అధ్యక్షుడు ఆదర్శ్ కుమార్, రామా రావు జి.నరసింహ, రవీందర్, ప్రకాష్, మల్లికార్జున్, మహేష్, మహేందర్, హనుమంత్‌రావు, శ్రీనివాస్, నరేష్‌మాదిగ, గంగాధర్ యాదవ్, నాగలక్ష్మి, సరోజా, వరుణ్ యాదవ్, శ్రీనివాస్ శ్రీనివాస, రామకృష్ణ, మానస్, నరేందర్ రెడ్డి, కోటి, గోపీ, పవన్, ఉదయ్, విశాల్, పాల్గొన్నారు.




సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ముదిరాజ్ అడ్వకేట్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్, చప్పరి శంకర్‌ముదిరాజ్, ఆంజనేయులు, రామారావు, డిఎల్ పాండు, అర్జున్‌కుమార్, శ్రీనివాస్‌రాజు తదితరులు

# లేబర్ కోడ్స్ రద్దుకై ఉద్యమించాలి

### టియుసిఐ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్స్ రద్దుకై ఉద్యమిం చాల్సిన అవసరం ఉందని టియుసిఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం విద్యానగర్‌లో మార్క్స్ భవన్ లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల టియు సిఐ ప్రథమ మహాసభ టి యు సి ఐ అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భం గా వనమాల కృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధిం చుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్స్ గా మార్చి దేశ కార్పొరేట్లకు, వారి ఆస్తులను పెంపొందించుకోవడానికి రూపొందించా లని అన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన విమానయానం, నౌకాయానం, రైల్వే, బ్యాంకింగ్, ఎల్ఐసి, డిఫెన్స్, బొగ్గు, భూగర్భ ఖనిజ సంపద కార్పొరేట శక్తులకు దోచిపెట్టడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఎనిమిది గంటల పని దినం రద్దుచేసి, 12 గంటల పని విధానం తెచ్చిపట్టాడనీ ఉత్పత్తిలో, సర్వీసులో, సేవా రంగాలలో మరమనుషుల ను (రోబోలు) ప్రవేశపెట్టి కార్మిక వర్గానికి పని లేకుండా చేస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రజా వతిరేక విధానాలకు పాల్పడుతున్నా రని, కార్మిక వర్గం సంఘటితమై కార్మిక వర్గ హక్కులకై పోరాడాలని, పిలుపునిచ్చారు. టి యు సి ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం అన్మేష్ మాట్లాడుతూ కార్మిక వర్గం దేశ సంపదను సృష్టిస్తుంటే నేటి ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు దోసి పెడుతున్నారని అన్నారు. మనిషి శక్తి అద్భుతమని, నూతన టెక్నాలజీని కనిపెట్టి తక్కువ కాలంలో ఎక్కువ ఉత్పత్తిని చేయగలిగే మెదో శక్తిని తయారు చేశారని అన్నారు. ఇంత చేస్తున్న కార్మిక వర్గానికి కనీస వేతనాలు, కనీస సౌకర్యాలు లేవని అన్నారు. కార్మిక వర్గం పోరాడి, పోగొట్టుకుంటున్న హక్కులను నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ జిల్లాల టియుసిఐ ప్రధాన కార్యదర్శి వి.ప్రవీణ్, ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్‌వర్కర్స్ యూనియన్ ఎండి అఫ్జల్, కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్య దర్శి శ్రీనివాస్, తెలంగాణ భవన నిర్మాణ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ నల్లన, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.లక్ష్మి, కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకురాలు వీరమణి ప్రసంగించారు.




మాట్లాడుతున్న ఎంపిజే అధ్యక్షులు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్

## ప్రజా సమస్యలపై ఎంపిజె పోరాటం

**చార్మినార్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** ప్రజలు ఎదుర్కొంటున్న సామా జిక, ఆర్థిక, విద్య, రాజకీయ సమస్యల పరిష్కారం కోసం మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ నిరంతరం కృషి చేస్తున్నదని ఆ సంస్థ అధ్యక్షులు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. పాతబస్తీ పురానీహవేలీ లోని ఎంపిజే ప్రధాన కార్యాలయంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. తెలంగాణలో రాజకీయ, సామాజిక పరిస్థితులు-మన బాధ్యతలు అన్న అంశంపై జరిగిన సమావేశంలో ఎంపిజే రాష్ట్ర అధ్యక్షులు ముహమ్మద్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఎంపిజే ఒక సామాజిక సంస్థ అని ఈ సంస్థ కులమతాలకతీతంగా ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నదని తెలియజేశారు. కేంద్రం తీసుకు వచ్చిని వక్ఫ్ సవరణ బిల్లును ఎంపిజె తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు లబ్ధి కలిగించే పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది మసూద్ అలీఖాన్, ఎంపిజే ఉపాధ్యక్షురాలు ఫరీసా ఖాద్రి, ప్రధాన కార్యదర్శి సలీమ్ అల్ హిందీ, ప్రతినిధులు ఏ.ఏ.నయూమ్, షేక్ ఖాసిం, కోశీధికారి అహ్మద్ హెచ్ షకీల్ పాల్గొన్నారు.

## శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంలో ఎస్ఎస్ఎఫ్ పాత్ర కీలకం : ప్రొ. కాసిం



మాట్లాడుతున్న ఒయు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** శాస్త్రయ దృక్పథాన్ని పెంపొం దించడంలో ఎస్ఎస్ఎఫ్ పాత్ర చాలా ఉందని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం అన్నారు. ఆదివారం బాగ్‌లింగం పల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. భారత నాస్తిక సమాజం 1972లో ఏర్పడి మూఢనమ్మకాల నిర్మూలన కోసం కృషి చేస్తున్నటువంటి సంఘానికి విద్యార్థి విభాగంగా 2004లో సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఏర్పడి ఎన్నో విద్యార్థి సమస్యల పైన సామాజిక, అసమానతల పైన నేటికీ 21 సంవత్సరాలుగా కృషి చేస్తున్న సందర్భంగా ఆ సంఘాన్ని ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకోవడం జరి గింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కాశీం ప్రసంగించారు. ప్రజాకవి జయరాజు మాట్లాడుతూ ప్రకృతిలో మమేకమై సైన్సును ప్రచారం చేస్తూ సమ సమాజ నిర్మాణంలో ఎస్ఎస్ఎఫ్ భాగం కావాలని కోరారు. విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు రమేష్ మాట్లాడుతూ సైన్సు దినదినాభివృద్ధి చెందుతుంటే మతవిశ్వాసాలని, అందవిశ్వాసాలని, మూఢనమ్మకాలని నిర్మూలించడంలో ఎస్ఎస్ఎఫ్ తనవంతు కృషిని చేస్తూ పనిచేయాలన్నారు. బానాస కేంద్ర కమిటీ సమన్వయకర్త జె జయ రవి మాట్లాడుతూ మూఢనమ్మకాల నిర్మూలన ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. ఫౌండర్ జయగోపాల్, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు వేదాంత మోర్య, ద్రవిడ విజయ్ జర్నలిస్ట్ రాకేష్ మోహన్, వెంకటేష్ సత్యశోధక్, శివ కళ్యాణి, ఎస్ ఎస్ ఎఫ్ జిల్లా నాయకులు అన్వేష్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్‌కు బిజెపి చేసిందేమి లేదు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

**కంటోన్మెంట్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** కంటోన్మెంట్ ప్రజలు వివిధ రూపాల్లో చెల్లిస్తున్న పన్నులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం చేసింది ఏమీ లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ సంకి రవీందర్, బల్వంత్‌రెడ్డి, రేపాల వెంకటేశ్వర్‌లు విమర్శించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చార్జీలు 7.5 శాతం ఉండగా కంటోన్మెంట్‌లో మాత్రం 11శాతం వసూల్ చేస్తున్నారన్నారు. దీనికి బీజేపీ ఏం సమాదానం చెబుతుంద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన టీపీటీ చార్జీలు క్రమం తప్పకుండా చెల్లిస్తుందని, దీనికి తామేదో చెసినట్లుగా నామినేటెడ్ సభ్యుడు గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. ఇక్కడి బీజేపీ నేతలకు నిజంగా దమ్ముంటే కేంద్ర రక్షణశాఖ నుంచి కంటోన్మెంట్‌కు రావాల్సిన కోట్ల రూపాయల సర్విస్ చార్జీ బకాయిలను విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాగినేని సరిత ఇతర నేతలు పాల్గొన్నారు.

## ఛత్రపతి జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

### -బిజెపి ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి రాష్ట్ర ప్రభుత్వం సెలవు రోజుగా ప్రకటించాలని డిమాండ్ తో వివిధ ఆర్గనైజింగ్ 100 చోట్ల తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనుసంధానం చేస్తూ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని చత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమం లో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి హిందువు చత్రపతి శివాజీ మహారాజ్ జీవిత చరిత్ర తెలుసుకోవాలన్నారు. నాడు మొగలుల అరాచకుల నుంచి విముక్తి కల్పించేందుకు హైందవ రాష్ట్రం స్థాపన లక్ష్యంగా చేసిన మహాయోధులు అని కీర్తించారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలను ఒక విధంగా, మెజార్టీ హిందులను ఒక విధంగా వ్యత్యాసంతో చూస్తుందని ఆరోపిం చారు. మెజార్టీ వర్గం హిందువుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని చత్రపతి శివాజీ జయంతి ఫిబ్రవరి 19న సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు సిడి చౌహాన్ మాట్లాడుతూ... చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్స వాలు సెలవు రోజుగా ప్రకటించాలని డిమాండ్ ఆన్లైన్ ఆఫ్ గ్లోబల్ హిందు ఫెడరేషన్‌లో లాగిన్ కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుడు శ్రీధర్, కాశీ విశ్వనాథ్ ట్రస్ట్ అధ్యక్షుడు శివ స్వామి, ఫౌండేషన్ సభ్యులు వెంకటేష్, విజయ్, రమేష్, నవరత్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాకేశ్‌రెడ్డి, సిడి చౌహాన్ తదితరులు

# విద్య ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



టేబుల్‌బుక్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రావురమేష్, కిరణ్‌లు

**నాంపల్లి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ఎనుముల రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రజలకు విద్య ఆరోగ్యం అందించడమే ప్రధాన ధ్యేయంగా బాధ్యతాయుతంగా ముందుకు సాగుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో స్కిల్ ఇండియా యూనివర్సిటీని పెద్దయెత్తున స్థాపించి ప్రపంచవ్యాప్తంగా మన రాష్ట్ర విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించాలని ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. గత 32 సంవత్సరాలుగా ఈ మహాకార్యానికి లయన్ కిరణ్ చేస్తున్న కృషిని అభినందించారు. రిపబ్లిక్ ఆఫ్ బల్గేరియా దౌత్య కార్యాలయ సహకారంతో సుచిరిండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలుగు లలితకళాతోరణంలో ఆదివారం రాత్రి సంస్థ సీఈఓ, ఎండి డా. వై. కిరణ్ అధ్యక్షతన జరిగిన ప్రతిష్ఠాత్మక అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రముఖ సినీనటుడు రావు రమేష్, నేహాచౌదరి తదితర అతిథులతో కలిసి ముందుగా సంస్థ టేబుల్‌బుక్ ఆవిష్కరించి అనంతరం విజేతలకు 32వ సర్ సి.వి.రామన్ యంగ్ జీనియస్ అవార్డులను ప్రదానం చేశారు. ఇందులో 20 మంది బంగారు పథకాలు, 40మంది రాష్ట్ర ర్యాంకర్స్, 400 మంది జిల్లా ర్యాంకర్లతోపాటు విద్యార్థుల గురువులు 20మంది గురుబ్రహ్మ-చాత్రాలయ అవార్డులు అందుకున్నారు.



మంత్రి దామోదర రాజనర్సింహతో మాట్లాడుతున్న బొజ్జ రాకేష్

## ఎబిసిడి వర్గీకరణపై ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తున్నాం

**నాచారం, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ రాకేష్ నగరంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి ఏబీసీడీ వర్గీకరణను కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తున్నా మని తెలిపారు. 30 సంవత్సరాల సుదీర్ఘమైన పోరాటానికి ఏబిసిడి వర్గీకరణ సుప్రీంకోర్టు ఆమోదించిన, రాష్ట్ర ప్రభుత్వం అమలుపరిచినం దుకు, బొజ్జ రాకేష్ మంత్రికి కృతజ్ఞతలు తెలి పారు. అనంతరం బొజ్జ రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశా వర్కర్లు అనేక ఒత్తిడిలో ఎదుర్కొం టున్నారని, ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిత్యం ప్రజలకు సేవలు అందిస్తున్నారని, వారి పనితీరులో రాష్ట్ర ప్రభుత్వానికి అనేక అవార్డులు రివా ర్డులు వచ్చాయని, ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం లేక వారి సేవలకు గుర్తింపు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వారి సేవలను గుర్తించి ఫిక్స్‌డ్ వేతనం రూ. 18 వేలకు పెంచి వారికి సంక్షేమ పథకాలను అమలుపరిచి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్రంలో 3000 ఆశా వర్కర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే భర్తీ చేసి, గ్రామస్థాయిలో ఉన్న నిరుద్యోగు లకు ఉపాధి కల్పించాలని మంత్రికి వినతిపత్రాన్ని అందజేశారు. దీంతో మంత్రి స్పందిస్తు తప్పకుండా వారి సేవలను గుర్తించి వారికి తగిన న్యాయం చేస్తామని మంత్రి హామీఇవ్వడం జరిగిం దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దళిత జన స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు ఇప్పల కుమార్, ఉప్పల్ ఇంచార్జి మాజీద్, పులి శ్రీకాంత్, క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం

**హయత్‌నగర్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** హయత్‌నగర్‌లోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణ, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్ల కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డిలు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఎర్ర రవీందర్, నాయకులు ఉగాదిఎల్లప్ప, గంగాని శ్రీను, పారందమహేష్, సంఘీ అశోక్ పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్



బోడుప్పల్‌లో మాజీ మంత్రి మల్లారెడ్డి పాల స్కూటర్ నడుపుతున్న దృశ్యం

## స్కూటర్‌పై మళ్లీ పాలు అమ్ముతూ కనిపించిన మాజీ మంత్రి మల్లారెడ్డి

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త :** బోడుప్పల్‌లో ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమానికి మాజీ మంత్రి మల్లారెడ్డి వెళ్లారు. అక్కడ పాల డబ్బాలతో కనిపించిన ఓ స్కూటర్‌ను చూడగానే మల్లారెడ్డి తన పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. దీంతో వెంటనే వెళ్లి ఆ స్కూటర్ ఎక్కేశారు. గతంలో పాలు అమ్ముతూ కష్టపడిన రోజులను నెమరేసుకున్నారు. అనంతరం ఎంతో ఆనందంతో స్కూటర్ పై నుంచి దిగి ఆ పాల బండి ఓనర్‌కు షేక్ హ్యాండ్ ఇచ్చారు. అనంతరం శాలువా కప్పి సన్మానించారు. ఇదంతా అక్కడే ఉన్న కొంతమంది వీడియో తీసి నెట్టింట పోస్టు చేశారు. కాగా, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి పేరు చెప్పగానే అందరికీ ముందుగా గుర్తొచ్చే డైలాగ్ ఒక్కటే! పాలు అమ్మినా.. పూలు అమ్మినా.. కష్టపడ్డా.. సక్సెస్ అయినా.. తన వేరియషన్‌లో మల్లారెడ్డి చెప్పిన ఈ డైలాగ్ చాలా పాపులర్ అయ్యింది.. డైలాగ్ వరకే కాదు.. నిజంగానే ఆయన పాలు అమ్ముకునే స్థాయి నుంచి వ్యాపారవేత్తగా, రాజకీయవేత్తగా ఎదిగారు.. అలాంటి మల్లారెడ్డి ఇప్పుడు మరోసారి స్కూటర్‌పై ఎక్కి పాలు అమ్ముతూ కనిపించారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.

## రాష్ట్ర మంత్రిత్వ శాఖ సహకారంతో సైకాలజిస్టులకు 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' శిక్షణ

**సైఫాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** సైకాలజిస్టుల నైపుణాభివృద్ధియే ధ్యేయంగా తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తున్నదని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోతుకురి రాంచందర్ తెలిపారు. సంఘం సభ్యులలో నైపుణ్యాల పెంపుదల కోసం నిరంతరం శిక్షణ అందిస్తున్నామని, ఇందులో భాగంగా మార్చి 10వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు హైదరాబాద్ నగరంలో 'ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్' పేరిట శిక్షణ రెండు తెలుగు రాష్ట్రాలలో సైకాలజిస్టులకు శిక్షకులు కావాలనే వారికి ప్రత్యేకంగా రాష్ట్ర మంత్రిత్వ శాఖ సహకారంతో అందిస్తున్నామని ఆయన చెప్పారు. శిక్షకులకు అవసరమైన నైపుణ్యాలు, జ్ఞానం, వైఖరుతలతో సన్నద్ధం చేయడం ప్రతిభావంతమైన శిక్షణలు అందించేలా తయారు చేయడం తమ సంఘం ముఖ్యఉద్దేశమన్నారు. ఈ శిక్షణా నాలుగు రోజులపాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వం, జట్టు నిర్మాణం, ప్రేరణ ప్రశ్నించే పద్ధతులు, శిక్షకుడి పాత్ర, బాధ్యత, పాఠ్య ప్రణాళిక, ప్రదర్శన ప్రణాళిక, తయారీ ఎయిడ్స్, పబ్లిక్ స్పీకింగ్ పాత్ర అనే అంశాలలో శిక్షణ అందిస్తామని ఆయన వివరించారు. శిక్షణ ద్వారా స్వీయ అవగాహన పెంపొందించడం, వ్యక్తిగత అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్టులే కాకుండా నాన్ సైకాలజిస్టులు, శిక్షకులుగా ఎదగాలనే ఉత్సహవంతులు ప్రొఫెషనల్స్, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, స్వయంగా అభివృద్ధి చెందాలనుకునేవారు హాజరు కావచ్చునని ఆయన మీడియాకు తెలిపారు. వివరాలకు 9533660936 అనే సెల్ నెంబరులో సంప్రదించాలని కోరారు.

## సంచార జాతుల ముస్లిం తెగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**చిక్కడపల్లి, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచార జాతుల ముస్లిం తెగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయా లని తెలంగాణ సంచార ముస్లిం తెగల సంఘం రాష్ట్ర అధ్య క్షుడు సైదాఖాన్ డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ సంచార ముస్లిం తెగల సంఘం ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా అధ్యక్షుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడు సైదా ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యంత దుర్భర జీవితాన్ని ఈ వర్గాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక రకాల వృత్తులను చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్న వారికి రాష్ట్రంలో గుర్తింపు లేకుండా పోయిందని ఆవే దన వ్యక్తం చేశారు. మరి ముఖ్యంగా వీరికి కులాల సర్టిఫికెట్లు కూడా లేవని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ వర్గాలకు గుర్తింపు వస్తుందని తామంతా ఆశించామని, కానీ తమ ఆశలని ఆడి ఆశలయ్యాయని అన్నారు. గతంలో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వ 10 సంవత్సరాల కాలంలో తమను నిరక్ష్యాన్లికి గురిచేసారని, అదే దారిలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నడుస్తుందని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలను కలిసినా కూడా తమను పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలను పరిష్కరించేంతవరకు వివిధ రూపాలలో ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి, కోశాధికారి యాకూబ్, నాయకులు రసూల్, ఇమామ్, రషీద్, అలీ అబ్బా స్, కమల్, గౌస్ , నాగుల్ మీర గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్రో కారిడార్లలో చక చక సర్వే పనులు

- జేబీఎస్-మేడ్చల్ మార్గంలో 25 చోట్ల, జేబీఎస్-శామీర్‌పేట్‌లో 19 చోట్ల భూసామర్థ్య పరీక్షలు
- ఈ నెలాఖరుకల్లా పూర్తి కానున్న ట్రాఫిక్ సర్వే



జేబీఎస్-మేడ్చల్ మెట్రో కారిడార్‌లో భూసామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త**

జేబీఎస్-మేడ్చల్ (24 కి.మీ), జేబీఎస్-శామీర్ పేట్ (21 కి.మీ) మెట్రో కారిడార్‌లకు డీపీఆర్‌ల తయారీకై అవసరమైన వివిధరకాల సర్వే పనులు జోరుగా సాగుతున్నాయి. డీపీఆర్‌ల తయారీకి మూడురకాలైన అధ్యయనాలు అవసరమని అవి.. ట్రాఫిక్ సర్వే, భూసామర్థ్య పరీక్షలు(జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్), పర్యావరణ ప్రభావ అధ్యయనం(ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్) అని మెట్రో ఎండి ఎన్వీఎస్‌రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. ట్రాఫిక్ సర్వేకి సంబంధించిన అధ్యయనంలో ఈ కారిడార్‌లలో ప్రస్తుతం జరుగుతున్న రోజు వారీ ప్రయాణాల సంఖ్య, భవిష్యత్‌లో జరగబోయే రోజువారీ ప్రయాణాల అంచనాలు, జంక్షన్ల వద్ద ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు తీసుకునే మలుపులు, పాదచార ప్రయాణికుల సంఖ్య, వాహన ప్రయాణాలకు పట్టే సమయం, వాహన ప్రయాణాల్లో ఎంత శాతం మెట్రో రైలుకు మారే అవకాశం, వివిధ మెట్రో స్టేషన్లు ఏర్పాటయ్యే ప్రదేశాల ప్రయాణ సాంద్రత వంటి అనేక అంశాలు పరిశీలిస్తామని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. ప్రాజెక్ట్ పర్యావరణ ప్రభావ అధ్యయనంలో ప్రస్తుతం ఈ మార్గాలలో ఉన్న గాలి పరిశుభ్రత, గాలిలో ఉన్న ధూళికణాల శాతం, కాలుష్య కారకాల నిర్ధారణ, శబ్ద కాలుష్యం, నీటి వనరులు, వృక్ష, జంతుజీవాల జీవ వైవిధ్యం, జీవనాధారభ్రుతులపై ప్రాజెక్టు చూపే ప్రభావం వంటి అంశాలు పరిశీలన చేయవలసి ఉంటుందని ఆయన తెలిపారు. ఇక భూసామర్థ్య పరీక్షల్లో ఈ మార్గాలలో ఉండే వివిధ రకాల మట్టి, రాతి పొరల నమూనాలు, వివిధ నిర్మాణాలకు కావాల్సిన భూ సామర్థ్య పరీక్షలు, భూగర్భంలో నిక్షిప్తమైన నీటి లెవెల్స్ అంచనాలు, భూకంపాలు ఏర్పడే అవకాశాలు వంటి విషయాలు క్షుణ్ణంగా అధ్యయనం చేసి మెట్రో స్తంభాలు, స్టేషన్లు, ఇతర నిర్మాణాలను ఎంత బలంగా డిజైన్ చేయాలో నిర్ణయిస్తామని అన్నారు. సామాన్యంగా ప్రతి అర కిలోమీటర్‌కి ఒక బోర్ హోల్ చొప్పున భూసామర్థ్య పరీక్షల నమూనాలు తీసుకోవడం జరుగుతోందని, ఒక్కొక్క బోర్ హోల్‌ను ఏభై నుండి వంద అడుగుల లోతు వరకు డ్రిల్లింగ్ చేసి, ఏ స్థాయిలో భూమి గట్టి తనం గానీ లేదా రాతి పొరలు తగులుతాయో పరిశీలిస్తామని మెట్రో ఎండీ చెప్పారు. ఇప్పటికే హెచ్ఎండీఏ, జాతీయ రహదారుల సంస్థ వారు కొన్ని భూ సామర్థ్య అధ్యయనాలు చేపట్టడం వల్ల, ఇప్పుడు మెట్రో సంస్థ జేబీఎస్-మేడ్చల్ మార్గంలో 25 చోట్ల, జేబీఎస్-శామీర్ పేట్ మార్గంలో 19చోట్ల ఈ భూసామర్థ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. వీటిలో మేడ్చల్ మార్గంలో 14 చోట్ల, శామీర్‌పేట్ మార్గంలో 11 చోట్ల ఇప్పటికే పరీక్షలు పూర్తయ్యాయని ఈ నెలాఖరులోగా మొత్తం అన్ని జాగాల్లో ఈ పరీక్షలు పూర్తవుతాయని చెప్పారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా సాఫీగా ప్రయాణించే విధంగా ఈ మెట్రో కారిడార్లను నిర్మించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం ఈ అధ్యయనాలు అన్నీ పూర్తి చేసి మార్చి నెలాఖరుకు శంషాబాద్ విమానాశ్రయం ఫ్యూచర్ సిటీ మార్గంతో సహా ఈ మూడు మెట్రో మార్గాల డీపీఆర్‌లను సంపూర్ణ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతికి సమర్పిస్తామని, రాష్ట్ర ప్రభుత్వ అనుమతి పొందిన తర్వాత డీపీఆర్‌లను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు.

## ప్రజల పాలిట శాపం.. చాక్నవాడి నాళా



గోషామహాల్‌నాలా

**గోషామహల్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని చాక్నవాడి నాళా అడుగుడుగునా గండం ప్రజల పాలిట ప్రాణ గండంగా మారింది. పురాతన నాళా ఏ సమయంలో ఎక్కడ కూలుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దాదాపు బిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో నాళా కూలిపోవడంతో అప్పటి ప్రభుత్వం కొంత మేరకు నాళాపై కప్పును నిర్మించారు. రెండు నెలలలోపు మూడుసార్లు నాళా కూలిపోవడంతో మరమర్మతులు చేస్తున్నప్పటికి ఏ సమయంలో ఎక్కడ నాళా కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ నాళాపై నుంచి రాత్రి వేళ్లలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏన్నోడో నిజాం కాలంలో నిర్మించిన నాళా పూర్తిగా కాలం తీరిపోయింది. రెండు నెలలలోపు మూడుచోట్ల నాళా అకస్మాత్తుగా కుప్పకూలిపోతుంది. ఒకవైపు కూలిపోయిన నాళాపై మరమర్మత్తులు చేస్తుండగా, మరో వైపు శనివారం మరోసారి నాళా కూలిపోయింది. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. చాక్నవాడి వెళ్లే రహదారిలో పురాతన నాళాపై చిన్నచితక వాహనాలతోపాటు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఏ సమయంలో ఎక్కడ నాళా కూలిపోతుందో తెలియని పరిస్థితిలో స్థానిక ప్రజలు అరచేతిలో ప్రాణాలను పెట్టుకుని బతుకు జీవుడని కాలం వెళ్ల తీస్తున్నారు. నాళాలకు అనుకుని నిర్మించిన భవనాలు ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. చాక్నవాడి ప్రాంతంలో పూర్తిగా ఉన్న నాళాపై కప్పును నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నాళా కూలిన విషయం తెలుసుకున్న బిజెపి నాయకులు రాత్రి వెళ్లి కూలిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. జిహెచ్ఎంసి అధికారులు తగిన చర్యలు తీసుకుని యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ప్రజారోగ్యంపై పొగ..!

- విషం చిమ్ముతున్న వాహన కాలుష్యం
- పేరుకే మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ స్టేషన్లు
- ఉత్తుత్తి తనిఖీలతో నకిలీ ధృవీకరణ పత్రాలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త**

గ్రేటర్లో వాహన కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. సల్ఫర్, కార్బన్ మోనాక్సైడ్ వంటి కాలుష్య కారకాలతో పాటు నైట్రోజన్ డయాక్సైడ్ వంటి హాని కారకాలు నగర వాతావరణంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నాయి. వాహన కాలుష్యాన్ని అంచనా వేసేందుకు, అరికట్టేందుకు ఏర్పాటు చేసిన కాలుష్య తనిఖీ స్టేషన్ల నిర్వహణ అలంకారప్రాయంగా మారింది. గ్రేటర్ హైదరాబాద్‌లోని మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ స్టేషన్లను రవాణా శాఖ ప్రధాన కార్యాలయంతో అనుసంధానం చేసి.. వాహనాల నుంచి వెలువడే కాలుష్య కారకాలను పారదర్శకంగా అంచనా వేసేందుకు సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు. కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకొని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఏళ్లు గడిచినా ఇప్పటివరకు ఈ సాంకేతిక వ్యవస్థ పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదు. దీంతో కాలుష్య నియంత్రణ పరీక్షలు ప్రహసనంగా మారాయి. దీంతో ప్రమాదకర కాలుష్య కారకాలు విషం చిమ్ముతూనే ఉన్నాయి. అయినా ఆ వాహనాలు కాలుష్య నియంత్రణ పరిధిలోనే ఉన్నట్లు సర్టిఫికెట్లు వచ్చేస్తూనే ఉన్నాయి. నకిలీ మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ స్టేషన్లో ఇందుకు ప్రధాన కారణం. ఆటో మొబైల్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఎఐ) నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా కాలుష్య తనిఖీలు నిర్వహించకపోవడం గమవార్హం.

### క్షీణిస్తున్న గాలి నాణ్యత...

నగరంలో గాలి నాణ్యత రోజురోజుకీ క్షీణిస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇందుకు ప్రధాన కారణం వాహన కాలుష్యమని అందరికీ తెలిసిన వాస్తవమే. అయినప్పటికీ ట్రాఫిక్ జామ్‌లతో ఆ భూతం మరింత బలపడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. శనివారం సాయంత్రం గాలి నాణ్యత సూచికలో పీఎం10 (వెంట్రుకలో పదివేల వంతు పరిమాణంలో ఉండే కాలుష్యకారక రేణువులు) క్యూబిక్ మీటర్‌కు 124 మైక్రో గ్రామ్స్ ఉన్నాయి. సాధారణంగా వీటిస్థాయి 1050 మధ్య ఉండాలి. వందవరకు ఉంటే క్షీణత మోతాదులో ఉన్నట్లు. కానీ అందుకు రెండున్నర రెట్లకు పైగా ఉందంటే గాలి నాణ్యత ఏస్థాయిలో పడిపోయిందో అర్థం చేసుకోవచ్చు. నగరంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే గాలి నాణ్యత క్షీణించినట్టుగా స్పష్టమవుతోంది. ఈ క్రమంలో క్యూబిక్ మీటరుకు లెక్కించినప్పుడు.. బంజారా హిల్స్ లో 129, విఠల్‌రావు నగర్‌లో 127, మాదాపూర్ లో 124, కోకాపేట్ ప్రాంతంలో 124 మైక్రోగ్రామ్స్ కాలుష్యకణాలు ఉన్నట్లుగా వెల్లడైంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 82,45,304 వాహనాలు ఉండగా, అందులో 58,71,539 ద్విచక్ర వాహనాలు, 15లక్షల కార్లు ఉన్నాయి. బంజారాహిల్స్, కోకాపేట్, మాదాపూర్ ప్రాంతాల్లో ప్రైవేట్, తదితర కార్యాలయాలు అత్యధికంగా ఉండటం వల్ల గ్రేటర్‌లోని 50 శాతం వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఆ తీవ్రతనే గాలి కాలుష్యానికి దారి తీస్తుండటం జరుగుతోంది.

### కొరవడిన ప్రామాణికత.. శాస్త్రీయత...

ప్రస్తుతం నగరంలో సుమారు 350 వరకు మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ కేంద్రాలు, పొల్యూషన్ టెస్టింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీటి ద్వారా నిర్వహించే తనిఖీల్లో మాత్రం ఎలాంటి ప్రామాణికత, శాస్త్రీయతలేదు. వాహనాల నుంచి వెలువడే పొగలోని కాలుష్య కారకపదార్థాలను అంచనా వేసి సర్టిఫికెట్లను అందజేసే, కాలుష్య తనిఖీ కేంద్రాలు ఉత్తుత్తి పరీక్షలతో కాసులు పండించుకుంటున్నాయి. దీంతో ప్రజారోగ్యానికి ప్రమాదకరంగా పరిణమించిన వాహన కాలుష్యాన్ని నియంత్రించాలనే ఉన్నత లక్ష్యయం పక్కదారి పడుతోంది. రోడ్డుపై అక్కడక్కడా దర్శనమిచ్చే మొబైల్ పొల్యూషన్ టెస్టింగ్ స్టేషన్లు వాహనదారులను నిలిపి పరీక్షలు నిర్వహిస్తాయి. కాలుష్య నియంత్రణలో ఆ వాహనం ఎలాంటి ప్రమాణాలను అనుసరించేదీ ధ్రువీకరిస్తారు. ఈ టెస్టింగ్ స్టేషన్లు అందజేసే ధ్రువీకరణ పత్రాలనే రవాణా శాఖ ప్రాతిపదికగా బావిస్తోంది. ఇలాంటి కీలకమైన అంశంలో టెస్టింగ్ స్టేషన్లలో సింహ భాగం ఎలాంటి పరీక్షలు లేకుండానే వాహనదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తు న్నాయి. అతి ప్రమాదకర కార్బన్ మోనాక్సైడ్, హైడ్రో కార్బన్ వంటి పదార్థాలను వెలువరించే వాహనాలకు సైతం ఈ స్టేషన్లు పచ్చజెండా ఊపుతున్నాయి. ప్రస్తుతం నైట్రోజన్ డయాక్సైడ్ వంటి కారకాలు సైతం బాగా పెరిగినట్లు పర్యావరణ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. గచ్చిబౌలి, హైటెక్ సిటీ వంటి కొత్త ప్రాంతాల్లో కాలుష్య కారకాలు ప్రమాద ఘంటికలను మోగిస్తున్నాయి.

### నిబంధనల ఉల్లంఘన...

నగరంలో కాలుష్య తనిఖీ కేంద్రాలకు తొలుత 1988లో రవాణా శాఖ అనుమతినిచ్చింది. ఆ తర్వాత 2006లో ఈ స్టేషన్లను కంప్యూటరీకరించాడు. కానీ వాహనాల్లోంచి వెలువడే పొగలో ఏ రకమైన కాలుష్య కారకాలు ఏస్థాయిలో ఉన్నాయో శాస్త్రీయంగా నిర్ధారించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఇప్పటికీ వినియోగంలోలేదు. ఖైరతాబాద్, బండ్లగూడ ప్రాంతీయరవాణా కార్యాలయాల్లో అప్పట్లో మోడల్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. కానీ వాటి విస్తరణ నత్తనడకన సాగుతోంది. కాలం చెల్లిన వాహనాలను తుక్కుగా మార్చేందుకు కొత్తగా స్క్రాప్ సెంటర్లను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే స్క్రాపింగ్ విధానాన్ని వాహనదారుల ఇష్టానికే వదిలి వేయడంతో కాలుష్య నియంత్రణను అరికట్టడంలో ఉదాసీనత చోటుచేసుకొంటోంది.

# బర్డ్ ఫ్లూ ఎఫెక్ట్..!

## కిటకిటలాడిన చేపల మార్కెట్లు..క్యూలైన్లలో మటన్ దుకాణాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 ప్రభాతవార్త**

ఆదివారం వస్తే చాలు గ్రేటర్ హైదరాబాద్ వాసులకు ముక్క లేకపోతే ముద్దదిగదు. బర్డ్ ఫ్లూ భయంతో ప్రజలు చికెన్‌కు బదులుగా.. మటన్, చేపల వైపు మొగ్గు చూపడంతో చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. ఇదే అదనుగా అమ్మకందారులు మటన్, చేపల రేట్లు అమాంతం పెంచడంతో మాంసహారప్రియులు గగ్గోలుపడుతున్నారు. బర్డ్‌ఫ్లూ సోకి కోళ్లు చనిపోతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా కొంతమంది ప్రజలు చికెన్ తినేయడం మానేస్తున్నారు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో చేపలు, మటన్ షాపుల వద్ద జనం క్యూ కట్టారు. దీంతో చికెన్ వ్యాపారులు కస్టమర్లు లేక దుకాణాల్లో ఖాళీగా కూర్చుంటున్నారు. మరోవైపు చేపలు, మటన్ అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ క్రమం లో చేపల రేట్లు ఒక్కసారిగా పెంచి అందినకాడికి స్వాహా చేస్తున్నారు వ్యాపారులు. గతంలో కిలో మటన్ ధర రూ.800 నుంచి 900కు విక్రయించే వారు. ప్రస్తుతం రూ.50 నుంచి రూ.100 వరకు పెంచి రూ.1000 చొప్పున అమ్ముతున్నారు. మాంసం ప్రియులు ఏమీ చేయలేక కొనుగోలు చేస్తున్నారు. రాంనగర్‌లోని చేపల మార్కెట్లో జనాలు కిక్కిరిసిపోయారు. కొత్తపేటలోని చేపల మార్కెట్లో ఉదయం నుంచి చేపల విక్రయాలు భారీగా జరుగుతున్నాయి. అదేవిధంగా చేపల రేట్లనూ పెంచి విక్రయిస్తున్నారు. రూ.200 నుంచి 210కు అమ్మే బొచ్చ, రవ్వ రకం చేపలను ఏకంగా రూ.250 కేజీగా అమ్ముతున్నారు. మధ్య తరగతి కుటుంబాలపై ఈ ధరలు ప్రభావం చూపుతున్నాయి. మొత్తానికి కోడికి వచ్చిన రోగానికి మాంస ప్రియుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. కిలోచికెన్ రూ.190-170 చొప్పున ధరలు పడిపోయినా బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో మాంసహార ప్రియులు ఆసక్తి చూపించలేదు. బర్డ్ ఫ్లూపై సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో సగానికిపైగా చికెన్ అమ్మకాలు తగ్గాయి. నగరం లో నిత్యం దాదాపు 6 లక్షల కిలోల చికెన్ అమ్మకాలు జరుగుతాయి. గత 23 రోజులుగా 50 శాతం కూడా అమ్మకాలు జరగడం లేదని వ్యాపారులు అంటున్నారు. గిరాకీ లేక చికెన్ దుకాణాలు ఖాళీగా కనిపిస్తున్నాయి.



## భక్తితోటే ముక్తికి మార్గం !



పాదయాత్రలో వెళ్తున్న శివ భక్తులకు పండ్లు అందజేస్తున్న కొమ్ము కృష్ణ

**నందిగామ ఫిబ్రవరి16 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మాలలు ధరించి శ్రీశైలం దైవదర్శనం కోసం వెళ్తున్న శివ భక్తులకు నందిగామ మాజీ ఎంపీటీసీ, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కొమ్ము కృష్ణ పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తి మార్గం ద్వారనే ముక్తి మార్గం లభిస్తుందని, దేవుని పట్ల విశ్వాసం ఉన్నవారికి అంతా మంచే జరుగుతుందని ఆయన ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌నాయకులు మనోజ్ రెడ్డి, కేశ మోని రామచేంద్రి, సప్పిడి మహేష్ , శివ భక్తులు ఉన్నారు. ఫోటో రైట్ అప్

## గ్రామాల్లో ఆధ్యాత్మిక సేవలు అభివృద్ధి చెందాలి



తండావాసులకు విరాళాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

**షాద్‌నగర్, ప్రభాతవార్త,ఫిబ్రవరి 16 :** గ్రామాల్లో ఆధ్యాత్మిక సేవలు పెంపొందించాలని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం మధురాపూర్ గ్రామ పంచాయతీ మంగలిగడ్డ తండాల్లో ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణం కోసం ఆయన రూ.50వేలను విరాళం ప్రకటించి, స్థానిక బీఆర్ఎస్ నాయకుడు బొమ్మ రంగయ్య గౌడ్ ద్వారా తండావాసులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నక్కల శ్రీశైలం గౌడ్, భైరమోని ఆంజనేయులు ముదిరాజ్, బొమ్మ శివకుమార్ గౌడ్, లోక్యా నాయక్, గోపాల్ నాయక్, జైహింద్ నాయక్, రాములు నాయక్, అంబదాసు నాయక్, పాండు నాయక్, వెంకటేష్ నాయక్, శివ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మల్లయ్య దేవుని ఆశీస్సులు అందరిపై ఉండాలి



దేవుని కళ్యాణం లో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ప్రముఖుల దృశ్యం

**నందిగామ ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** లోకకళ్యాణార్థం అవతరించిన మల్లయ్య దేవుని ఆశీస్సులు సమస్త మానవ, జంతు, పశుపక్షాదులపై ఉండాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డిలు భగవంతుని వేడుకున్నారు. ఆదివారంనందిగామ మండలం బండోనిగూడలో కాంగ్రెస్ సీనియర్ నేత పసుల బుచ్చయ్య ఆధ్వర్యంలో మల్లయ్య దేవుని ఆలయనాలుగవ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కళ్యాణంలో పాల్గొన్ని పూజలు చేశారు. ఈ వేడుకల్లో ఉమ్మడి మండలాల మాజీ జెడ్పిటిసి ఎం శ్యామ్ సుందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి, దేపల్లె కుమార్ గౌడ్, జట్ట శ్రీశైలం, బండ శ్రీశైలం, బండ అశోక్, కావలి కృష్ణ, జాల గూడెం రాజు, పసుల పాండు, బుగ్గ నర్సింలు,బుగ్గ శ్రవణ్,బక్క యాదయ్య, కూతురు పాండు, మల్లేష్, రాములు, బండ కుమార్, పసుల కుమార్, ఉన్నారు

## తాగునీటి వసతి కల్పించండి: బిజెపి



కాలనీవాసులను అడిగితెలుసుకుంటున్న బిజెపి ఇంఛార్జీ వై. సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 16,ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ ప్రతాప సింగారంలోని డబుల్ బెడ్రూం కాలనీకి తాగునీటి వసతి వెంటనే కల్పించాలని మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇంఛార్జీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్లలో ప్రభుత్వం తాగునీటి వసతి కల్పించకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై సమాచారం తెలుసుకున్న బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు బస్వరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇంఛార్జీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి ఆదివారం పర్యటించి సమస్యలను కాలనీవాసులను అడిగితెలుసుకున్నారు. తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కొంటున్న కాలనీకి తక్షణమే పైపులైన్ ఏర్పాటు చేసి నీటివసతి కల్పించాలని డిమాండ్ చేశారు. పేద మధ్యతరగతి ప్రజలు నివసించే కాలనీలో తాగునీటి లేకపోవడం శోచనీయమని అన్నారు. తాగునీటి కొరకు వందలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారని అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే తాగునీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు.

## జై భీమ్ యూత్ ఆత్మీయ సమ్మేళనం

**యాచారం ఫిబ్రవరి 16 తర్వాత వార్తలు:** ఐక్యతతో అన్ని సాధించ వచ్చని జైభీమ్ యూత్ వ్యవస్థాపకులు ఉపాధ్యాయులు మరాటి యాదయ్య ఎర్కొన్నారు. ఆదివారం యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలో జైభీమ్ ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాల కులబందు మిత్రుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయులు మరాటి యాదయ్య, భూపతి దాసు, భూపతిగోపాల్, భూపతి సువర్ణ,వార్డు సభ్యులు తెలుగమళ్ళ అనిత, బండి ఉమారాణి హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐక్యతతోని అన్ని సాధిస్తామని అన్నారు. జై భీమ్ యూత్ స్థాపించి 25 సంవత్సరాలు అయిందని ఎన్నో విద్య ఆట పాట సాంస్క ృతిక కార్యక్రమాల ఏర్పాటుచేసి మంచి పేరు ప్రఖ్యాతలు సాధించిందన్నారు. మరిన్ని కార్యక్రమాలు చేపట్టి సంఘంలో సమాజంలో జై భీమ్ యూత్ కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. సామాజిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి అందరికీ ఆమోదయోగంగా ఉండే మంచిగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలే యాదయ్య,సీనియర్ జర్నలిస్టు మరాటి రవి, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, పంబాల యాదయ్య, తెలుగు మల్ల యాదయ్య, తెలుగమల రవీందర్, మరాటి నరసింహ,మరాఠీ మహేందర్, భూపతి యాదయ్య, తెల్లమల్ల రాజేందర్, భూపతి గౌతమ్, తెలగమల్ల ప్రశాంత్ కుమార్, భూపతి రామకృష్ణ, మరాఠి గణేష్, యూత్ సభ్యులు మహిళలు చిన్నారులు బంధు మిత్రులందరికీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జై భీమ్ యూత్ సభ్యులు బంధుమిత్రులున్నారు.

# ఆమనగల్లులో ధర్నా కు భారీ సంఖ్యలో రైతులు హాజరు కావాలి

**తలకొండపల్లి ఫిబ్రవరి 16: ప్రభాతవార్త:**రంగారెడ్డి జిల్లా పరిధిలోని కల్వకుర్తితాలూకా స్థాయి రైతు దీక్ష సమావేశం ఆమనగల మండల కేంద్రం లో ఈనెల 18న పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నందున రైతులు, బి ఆర్ఎస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ పిలుపు చ్చారు. ఆదివారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని చీపునుంతల, దేవిని పడకల్, పడకల్,లింగరావుపల్లి, తలకొండపల్లి, చంద్రధన, రాంపూర్,మెదక్‌పల్లి, గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలోని రైతులుప్రజలు బిఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడుతూ ఈనెల 18న ఆమనగల్ మండల కేంద్రంలో పెద్ద ఎత్తున రైతులందరి తో రైతుదీక్ష చేపడుతున్నామని ఈ రైతుదీక్షకు ముఖ్య అతిథులుగా బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హాజరవ ుతున్నందున పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు అనేక హామీలుగుప్పించి అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కిందని, ఆర్ గ్యారంటీ ల పేరుతో అందరిని మోసానికి గురిచేసిందని ఆయన అన్నారు. రైతులకు ఇవ్వవలసిన రైతు భరోసా, వృద్ధాప్యంలో పెన్షన్, ఎన్నో కార్యక్రమాలను వదిలేసి తెలంగాణ ప్రజలను మోసానికి వంచన గురి చేయడాన్ని నిరసిస్తూ రైతులందరితో ~ ఎత్తునధర్నా కార్యక్రమం



చేపడుతున్నందున ఆయా గ్రామాల నుంచి రైతులు బి ఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయ వంతం చేయాలని ఆయన కోరారు. ఆయన వెంట తలకొండపల్లి మాజీ ఎంపీపీ తిరుమని నిర్మల శ్రీశైలంగౌడ్,మాజీజెడ్పిటిసి పద్మ నం`సింహ, తలకొండపల్లి సర్పంచుల సంఘం మాజీఅధ్యక్షులు గోపాల్ నాయక్, టిఆర్ఎస్ మండల అధ్యక్షులు కుమ్మరి శంకర్, మాజీసర్పంచ్ పెరుమాల లలిత జోతయ్య, మోహన్‌రెడ్డి, దరువులశంకర్,నరేష్ మల్లేష్,దరువులరాజు,రజనీకాంత్, భూపాల్, దశరథమల్లేష్ సురేష్ నాయకులు సంపత్ కుమార్, చవిటి విజయ్, సొల్లు సుధాకర్ తోపాటు ఆయా గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.

# ఘనంగా సంకష్టహర చతుర్థి వేడుకలు



ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 16 :** షాద్‌నగర్ పట్టణంలోని 20వ వార్డు వినాయకగంజ్‌లో గల గణేష్ దేవాలయంలో ఆదివారం సాయిమిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో మాఘమాస సంకష్టహర చతుర్థి పూజలు చేశారు. ఈ పూజా కార్యక్రమానికి పట్టణ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, అగ్గనూరు బసవేశ్వర్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర ్భంగా అన్న వితరణ దాత సుదీప్ జాదవ్ దంపతులను సత్య నారాయణ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయ కులు మొగిలిగిద్ద యుగంధర్, నందకిశోర్, అభిలాష్, అమరలింగేశ్వర్, ప్రవీణ్, బిక్కుమల్ల శ్రీకాంత్, మల్కాయగారి వెంకట్‌రెడ్డి, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్, ఆలయ ట్రస్టు సభ్యులు శంకర్ లాల్ లాహోటి, మహావీర్, భరత్, ఆలయ పూజారి పండిట్ విష్ణుశర్మ, మహిళలు పాల్గొన్నారు.

# హరిత తెలంగాణ సాధనకు అందరం అడుగులు వేయాలి

**బొంరాస్‌పేట్,ఫిబ్రవరి16,ప్రభాతవార్త :** తెలంగాన మాజీ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు జన్మదినం సందర్భంగా గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ పిలుపుమేరకు వృక్షార్చన కార్యక్రమం పోస్టర్‌ను తుంకిమెట్ల చౌరస్తాలో బిఆర్ఎస్ నాయకులు వృక్షార్చనపోస్టర్‌ను అవిష్కరించారు.హరితసేన వికారాబాద్ జిల్లా బాధ్యులుఎరన్‌పల్లి శ్రీనివాస్,మాజీ ఎంపిటీసి తిరుపతయ్య గ్రీన్ ఇండియాఛాలేంజ్,వృక్షార్చన పోస్టర్ విడుదల చేయడం జరిగింది.మాజీ సీఎం కెసీఆర్ ప్రతిగ్రామంలో హరితహరం అనే ప్రత్యేక కార్యక్రమం ద్వార చెట్లను నాటి హరిత తెలంగాణ కోసం కృషిచేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలిపిన మహోన్నతమైన వ్యక్తి జన్మదినం సందర్భంగా ఈ నెల 17న ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు.ప్రతి ఒక్కరు మూడు మొక్కలను నాటి హరిత తెలంగాణ కోసం అందరూ అడుగులు వేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ యువనాయకులు



వృక్షార్చన పోస్టర్‌ను విడుదల చేస్తున్న నాయకులు.

మల్లేష్‌గౌడ్,సోషల్ మీడియా బాధ్యులు నేహ్రూనాయక్,మాజీ కోఅప్షన్ సభ్యులు జలీల్,రాములు,అంజిలయ్య,కృష్ణయ్య,బసయ్య, పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలు



**షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి16 :** తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పు స్కరించుకొని షాద్‌నగర్ పట్టణ కేంద్రంలోని అయ్యప్ప కాలనీలోగల నవోదయ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు తెలంగాణ జాగృతి నియో జకవర్గ కన్వీనర్ ఎం.డి.ముస్తాఫా ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం, వంట సామాగ్రి, పండు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులతో కలిసి కేక్ కట్ చేసి వారితో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను కోరుకుంటున్నారని, తెలంగాణలో ఆసరా పెన్షన్ పథకాన్ని ఎంతో విజయవంతంగా అమలు చేసిన గొప్ప నేత అని ఆశ్రమ వృద్ధులు కొనియాడుతున్నారని, తెలంగాణ రైతులు, ప్రజలందరు కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్‌నాయక్,గణేష్ నాయక్, జలీల్, హమీద్ పాల్గొన్నారు.

## ముగిసిన హజరత్ సయ్యద్‌షా రాజవలి ఉర్సు ఉత్సవాలు



భక్తులకు అన్నదానం చేస్తున్న ఖాదర్ గోరి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి16 :** అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో వెలసిన హజరత్ సయ్యద్ షా రాజావలి 414వ ఉర్సు ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. షాద్‌నగర్ పట్టణానికి చెందిన సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు ప్రజాసేన జాతీయ అధ్యక్షుడు ఖాదర్ గోరి ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన అన్నదాన కార్యక్రమానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ముందుగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖాదర్‌గోరి మాట్లాడుతూ త్వరలోనే తీయనున్న కొత్త సినిమాలో నూతన నటీనటులకు అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యన్మన్‌గండ్ల లక్ష్మణ్, నాగకృష్ణ, సమద్, దర్గా కమిటీ నిర్వాహకులు, దర్గా యూత్ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యాధికారికి సన్మానించిన ఉపాధ్యాయులు



విద్యాధికారికి సన్మానించిన ఉపాధ్యాయులు

**బషీరాబాద్, ఫిబ్రవరి16,ప్రభాతవార్త:**బషీరాబాద్‌మండల విద్యాధికారిగా నూతన పదవి బాధ్యతలు చేపట్టిన దూస రాములు ను మండల పిఆర్‌టియుటిఎస్ అధ్యక్షులునర్సింహరెడితోపాటు మండల ఉపాధ్యా యులు.విద్యాధికారి నివాసంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిచారు.ఈ సందర్భంగా పూలమాల శాలువా తోవిద్యాధికారిని ఘనంగా సన్మానించి మిఠాయిలు తినిపి ంచారు .అనంతరంవారు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి, నాణ్యమైన విద్యాబోధనకు సహకరించి ఉపాధ్యా యులకు, విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించాలని కోరినట్లు తెలిపారు. మండల పరిధిలోని మారు మూల గ్రామాల్లో విద్యాభివృద్ధికి సైతం కృషి చేయాల న్నారు.ఈ గౌరవఅధ్యక్షులువెంకట్రామిరెడ్డి,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి,రాష్ట్రకార్యదర్శి అయుబ్, జిల్లా బాధ్యులు నర్సిములు, అల్లావుద్దీన్, బిక్షపతి, ముస్తఫా, మండల అసోసియేట్ అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మౌలానా పాల్గొన్నారు.

## ప్రజలకు రుచికరమైనఆహారాన్నిఅందించాలి



**షాద్‌నగర్, ప్రభాతవార్త, ఫిబ్రవరి 16 :** ప్రజలకు రుచికరమైన ఆహారాన్ని నాణ్యతతో అందించాలని, తద్వారా వ్యాపార రంగంలో మరింత ఉన్నతంగా ఎదగవచ్చని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన భవానీ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే శంకర్ మాజీఎమ్మెల్యేచౌలపల్లి ప్రతాప్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, నవీన్, చెంది తిరుపతి రెడ్డి, రఘు నాయక్, సీతారాం, ఖదీర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

# గృహ జ్యోతి కాంతులు ప్రగతికి కేర్ ఆఫ్ నందిగామ

**నందిగామ ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** నిత్య కృషివలుడు.. జనం మెచ్చిన నచ్చిన నేత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సొంత మండలం నందిగామ అభివృద్ధివైపువడివడిగా అడుగులు వేస్తుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకివచ్చిన 13 నెలల కాలంలోనే మండల సర్వతో ముఖాభివృద్ధి కోసం కృషి చేస్తూనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష ్యంగా నడుము బిగించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీ పథకాల్లో అర్హులందరికీ రేషన్ కార్డుల జారీ , ఇందిరమ్మ ఇళ్ల ఆత్మీయ భరోసా, గృహజ్యోతి పథకంతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. నందిగామ మండలంలో 4527 మంది జీరో బిల్లు విద్యుత్‌వినియోగదారులులబ్ధిపొందుతున్నారు.

మండలంలో అత్యధికంగా 97.54 శాతం మంది విద్యుత్ జీరో బిల్లు వినియోగదారులు ఉండడం విశేషం. కేవలం ఒక నందిగామలో 862 మంది నిరుపేదలు జీరో బిల్లును సద్వినియోగం చేసుకుంటూ న్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇవే కాకుండా మండల ప్రజా పరిషత్ కార్యాలయ నిర్మాణ పనులు వేగవంతం, ఎమ్మార్సీ భవన నిర్మాణ పనులు చక చక సాగడం, నందిగామ చౌరస్తా వద్ద ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం నిర్మాణం పనులు జరగడం, అప్పారెడ్డి గూడలో మత్స్య కార్మికులక ఉపాధి కోసం సంచార చేపల విక్రయ వాహనాన్ని సబ్సిడీతో ఇవ్వడం, నందిగామలో ఉర్దూ మీడియం పాఠశాల నిర్మాణ పనులకు



జోరుగా కొనసాగుతున్న నర్సప్పగూడ బీటీ రోడ్డు పనులు.

నిధుల కేటాయింపు, ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణ పనులకు శ్రీకారం తదితర అభివృద్ధికి సంకేతాలుగా మిగిలాయి. ఫరూక్ నగర్ నుండి బుగ్గోని గూడ వరకు, వెంకమ్మగూడ మీదుగా సింబాసిస్ యూనివర్సిటీవరకు రహదారి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎన్నోఏళ్లుగా రహదారి గోతుల మయమై అవస్థలు పడుతున్న నర్సప్పగ ూడ ప్రజలకు బీటీ రోడ్డు పనులు కొనసాగడం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంగానరసింహులు, నర్సప్పగూడ మాజీ సర్పంచ్ కావలి కృష్ణ, నందిగామ మాజీ ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్ రెడ్డి,దేపల్లె కుమార్‌గౌడ్, గ్రామీణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## వాలీబాల్ క్రీడాకారులకు సామాగ్రి పంపిణీ



క్రీడాకారులకు క్రీడా సామాగ్రి పంపిణీ చేస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 16, ప్రభాత వార్త:** క్రీడాకారులు, యువత, సీనియర్ సిటిజన్లు తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోచారం మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. అన్నోజిగూడ యాదాద్రీ పార్కు తెలంగాణ క్రీడ ప్రాంగణం వద్దవాలీబాల్ క్రీడాకారులకు మాజీ చైర్మన్ తన సొంత ఖర్చులతో క్రీడాకారులకువాలీబాల్ కిట్‌ను ఆదివారం అందజేసినట్లు తెలిపారు. యువత ఆడుకోవడానికి యాద్రాద్రీ పార్కు వద్ద రెండు ఎకరాల స్థలంలో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. క్రీడాప్రాంగణాన్ని యువత, క్రీడాకారులు సద్వినియోగంచేసుకోవాలని కోరారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఓపెన్ జిమ్ము, యోగకేంద్రంఅందుబాటులోఉన్నాయనివీటినిఉపయోగించుకోవాలని కోరారు. వాలీబాల్ కిట్‌పంపిణీ కార్యక్రమంలో నాయకులు జితేందర్ నాయక్, కొంతం ఎట్టారెడ్డి,ఒరుగంటిహరిశ్‌గౌడ్, జితేందర్,మహేశ్,సింహాద్రి క్రీడాకారులు పాల్గొన్నారు.

## కాసు శ్రీనివాస్ రెడ్డి సొంత నిధులతో నిర్మాణాలు



వ్యక్తిగత నిధులతో నిర్మించిన పైపులైన్ పనులు పరిశీలిస్తున్న కాసు శ్రీనివాస్ రెడ్డి

**తలకొండపల్లి ఫిబ్రవరి 15: ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని లింగారావుపల్లి గ్రామంలో శతాబ్ది టౌన్షిప్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగతంగా5 లక్ష ల రూపాయల నిధులతో గ్రామంలోని కాలనీలకు నూతనంగా పైప్ లైన్, విద్యుత్ స్తంభాలు మరి యు కాలనీలకు సీసీ కెమెరాలు నిర్మాణం చేపట్టారు. లింగారావుపల్లి గ్రామంలోని మూడు నాలుగు ఐదు ఏడో వార్డులలో నీటి ఇబ్బందులు ఉండడంతో వ్యక్తిగతంగా ఒక లక్ష రూపాయలు ఖర్చు చేసి నూతనంగా పైప్లైన్ గేట్‌వాల్ నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. శనివారం నాడు లింగరావుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన తాగునీటి పైప్లైన్ పనులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కాసు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రామకృష్ణాపురం గ్రామంలో సుమారు 4లక్షల రూపాయలతో సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాల స్తంభాలు నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఇంకా గ్రామంలో చిన్న చిన్న సమస్యలను తీర్చేందుకు వ్యక్తిగత నిధులు వెచ్చించి పనిచేయనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో నీ మౌలిక వసతులకు ఎలాంటి సమస్యలు రాకుండా వ్యక్తిగతంగా నిధులతో ఖర్చు చేసి అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ గట్ల కేశవరెడ్డి, శతాబ్ది టౌన్షిప్ అధినేత కాసు శ్రీనివాస్ రెడ్డి, ఎంపిటిసిల సంఘం మాజీ అధ్యక్షులు జోగు రమేష్, గ్రామస్తులు బాలెడ్డి భాస్కర్ రెడ్డి చెన్నయ్య ఉన్నారు.

## కళాశాలలో నిర్వహించిన మెక్స్‌ప్లోరర్ పోటీలు



కళాశాలలో నిర్వహించిన మెక్స్‌ప్లోరర్ కాంపిటేషన్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు.

**ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 16,ప్రభాత వార్త:** పోచారం మున్సిపల్ అనురాగ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంటులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్, స్టూడెంట్ చాప్టర్ గేర్ హెడ్ మోటార్స్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో మెక్స్‌ప్లోరర్ కాంపిటేషన్ జరిగింది. ఈ కాంపిటేషన్ పోటీల్లో ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన30 జట్లు పాల్గొన్నాయి. ఇందులో పాల్గొన్న విద్యార్థులు పరిశోధక నైపుణ్యాలను, పునర్నిర్మాణ నైపుణ్యాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య సికిందర్ బాబా, సహ ఆచార్యులు కృష్ణయ్య, మదన్‌మోహన్ రెడ్డి, కోఆర్డినేటర్ స్రవంతి అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన బండెల ఎల్లమ్మ జాతర ఉత్సవాలు



అమ్మవారి పల్లకి సేవా ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

**కొడంగల్,ఫిబ్రవరి 16ప్రభాతవార్త :** ప్రజల ఆరాధ్య దైవంగా కొలిచే బండెల ఎల్లమ్మ జాతర ఉత్సవాలు భక్తుల కొలహాలం మధ్య అమ్మవారి పల్లకిసేవా,పెరుగు బసంతం కార్యక్రమంతో ముగిశాయి.ఈనెల 14 నుంచి ప్రారంభమైన జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మొదటి రోజు అమ్మవారి రథోత్సవం,రెండవ రోజు శనివారం కాడెద్దుల బండ్ల ఊరేగింపుతో పాటు చివరి రోజు ఆదివారం అమ్మవారం పల్లకి సేవా,పెరుగు బసంతం కార్యక్రమాలు వైభవంగా కొనసాగాయి.ఈ సందర్భంగా ఆలయంలోఅమ్మవారికివిశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు .అనంతరం ప్రత్యేక అలంకరణలతో అమ్మవారిని పల్లకిలో ఆలయం చుట్టు ఊరేగిస్తు పెరుగుబసంతం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు మహిళలు అమ్మవారి పల్లకి సేవ ముందు పూనకంతో ఊగిపోయారు.పెరుగుబసంతం కార్యక్రమంలో భాగంగా ఉట్టికొట్టడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు.మూడు రోజుల పాటు కొనసాగిన బండెల ఎల్లమ్మ జాతర ఉత్సవాలకు కొడంగల్‌తో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.ఈ సందర్భంగా జాతర ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాతర ఉత్సవాల కమిటీ నిర్వహకులు తగు ఏర్పాట్లు చేశారు.అలాగే పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

## ఉరి వేసుకొని వ్యక్తి మృతి

**నందిగామ ఫిబ్రవరి 16 ప్రభాతవార్త:** బతుకుతెరువు కోసం రంగాపూర్ కు వచ్చిన ఓ వలస కార్మికుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. గత పదేళ్ల క్రితం కొల్లాపూర్ నుండి నందిగామ పారిశ్రామిక వాడ రంగాపూర్ కు వచ్చిన వెంకటేష్ (28) తన భార్య పిల్లలతో వచ్చి అద్దె ఇంట్లో నివాసం ఉంటూ జీవిస్తున్నాడు. ఇదిలా ఉండగా ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని వెంకటేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతునికి భార్య , కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనతో వలస కూలీల్లో తీవ్ర విషాదం అలుగుతుంది.